ఆనంద నిలయం

సొంతింట్లోకి లక్ష్మీదేవి కుటుంబం



నూతన ఇంటిని రిబ్బన్ కట్ చేసి ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, చిత్రంలో గుండుమల తిప్పేస్వామి తదితరులు



గడప వద్ద పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే, ఇంటి యజమాని లక్ష్మీదేవి, టీడీపీ నాయకులు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

అక్షరాలు సరిగా నాటితే వాటి ఫలాలు ఎంత మధురంగా ఉంటాయో చెప్పేందుకు ఉదాహరణ.. ఈ ఇల్లు..! భూమ్మీద ప్రతి ఒక్కరి ఉమ్మడి కల.. సొంతిల్లు. అది సాకారమైతే కలిగే ఆనందం అంతా ఇంతా కాదు. గుడిసె అయినా సరే.. గుడారమైనా సరై.. సొంతం అంటూ ఒకటి ఉండాలని అనుకుంటారు. నరసింహమూర్తి కుటుంబం కూడా ఇదే ఆశించింది. పేదరికం కారణంగా సొంతింటిని నిర్మించుకోలేకపోయింది. అద్దె చెల్లించే ఆర్థిక స్తోమతా వారికి లేకపోయింది. దీంతో కొన్నేళ్లపాటు బాత్‌రూమ్‌లో నివాసం ఉన్నింది. వారి కష్టానికి ఆంధ్రజ్యోతి అక్షర రూపం ఇచ్చింది. స్పందించిన స్థానిక ఎమ్మెల్యే.. ఆ ఊరికి వెళ్లారు. వారి కష్టాన్ని చూసి చలించిపోయారు. అధికారులతో మాట్లాడి ఇంటి పట్టాను ఇప్పించారు. ఇంటి నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఆర్థిక సాయం అందించారు. నెలల వ్యవధిలో పక్కా ఇల్లు సిద్ధమైంది. అందంగా ముస్తాబు చేసిన ఆ ఇంటిని బుధవారం రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు ఎమ్మెల్యే. పండుగ వాతావరణంలో ఇంటి యజమాని లక్ష్మీదేవి దేవుడి పటంతో, కుటుంబ సభ్యులతో కలిసి గడపలో అడుగు పెట్టారు. అతిథులందరికీ కడుపు నిండా భోజనం పెట్టారు. టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు గుండుమల తిప్పేస్వామి, రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసమూర్తి, మండల కన్వీనర్ లక్ష్మీనారాయణ, నాయకులు కోట్ల రంగేగౌడ్ తదితరులు పాల్గొన్నారు. మాటల్లో చెప్పలేని ఆనందం ఆ ఊరి జనంలో కనిపించింది. అక్షరాల్లో వర్ణించలేని కృతజ్ఞత ఆ ఇంటి వారి కళ్లలో కనిపించింది. ఆంధ్రజ్యోతి అక్షరం ఆయుధం మాత్రమే కాదు.. ఆసరా కూడా..!

- ఆంధ్రజ్యోతి, మడకశిర రూరల్

పటిష్టంగా 20 సూత్రాలు

అమలు చేయాలి

- చైర్మన్ లంకా దినకర్



మాట్లాడుతున్న చైర్మన్ లంకా దినకర్, చిత్రంలో కలెక్టర్, ఎమ్మెల్యే

పుట్టపర్తిటౌన్, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): జిల్లాలో 20 సూత్రాల అమలును పటిష్టంగా నిర్వహించాలని కమిటీ చైర్మన్ లంకా దినకర్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని సమావేశ భవనంలో బుధవారం 20సూత్రాల అమలు, కేంద్ర ప్రభుత్వ ప్రాయోజిత పథకాలు, రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు తీరుపై కలెక్టర్ టీఎస్ చేతన్, ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డితో కలిసి ఆయన అధికారులతో సమీక్షించారు. ఈసందర్భంగా లంకా దినకర్ మాట్లాడుతూ జాతీయ ఉపాధి పథకంలో భాగంగా గత ఐదేళ్లలో చేపట్టిన పనులు, సిమెంటు, మెటీరియల్ కొనుగోళ్లపై సోషల్ ఆడిట్ నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలోని చిత్రావతి, గొల్లపల్లి రిజర్వాయర్, పీఏబీఆర్ డ్యామ్ ద్వారా 32 మండలాలకు సురక్షిత తాగునీరు అందించడానికి చర్యలు తీసుకోవాలన్నారు. సూర్యఘర్ పథకాన్ని పక్కాగా అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో సీపీఓ విజయ్‌కుమార్, డ్వామా పీడీ విజయేంద్రప్రసాద్, ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఈ మల్లికార్జున, హౌసింగ్ పీడీ వెంకటనారాయణ, డీఆర్‌డీఏ పీడీ నరసయ్య, పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ నాగరాజు, టూరిజం శాఖ జయకుమార్, ఎపీఎంఐపీ పీడీ సుదర్శన్, జిల్లా వ్యవసాయాధికారి సుబ్బారావు, పరిశ్రమల శాఖ జోనల్ మేనేజర్ టోనీసహాని, పుట్టపర్తి మున్సిపల్ కమిషనర్ ప్రహ్లాద పాల్గొన్నారు.

అధికారుల తీరుపై ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి ఆగ్రహం

కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను క్షేత్రస్థాయిలోకి తీసుకెళ్లడంలో అధికారులు విఫలమయ్యారంటూ ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి ఆగ్రహం వ్యక్తంచేశారు. అలాగే సత్యసాయి శతజయంతి ఉత్సవాల విజయవంతానికి చేయాల్సిన ముందస్తు ఏర్పాటుపై ఆమె అసంతృప్తి వ్యక్తం చేశారు. చిత్రావతి నది సుందరీకరణ పనులు వేగవంతంచేయాలని పర్యాటక శాఖను ఆదేశించారు.



సంగీత కచేరీ నిర్వహిస్తున్న డాక్టర్ కార్తీక్ బృందం

అలరించిన సంగీత కచేరి

- కొనసాగిన అతిరుద్ర మహాయజ్ఞం

పుట్టపర్తి, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): ప్రశాంతి నిలయంలో బుధవారం సాయంత్రం నిర్వహించిన సంగీత కచేరీ ఆహూతులను ఆకట్టుకుంది. సాయికుల్వంతులో నిర్వహిస్తున్న అతిరుద్ర మహాయజ్ఞం సందర్భంగా ప్రముఖ సంగీత గాయకులు డాక్టర్ కార్తీక్ బృందం సంగీత గాన కచేరి నిర్వహించింది. గంటపాటు వాయిద్యగానంతో భక్తులను అలరింప జేశారు. అంతకుముందు ఉదయం అతిరుద్ర మహాయజ్ఞం ఆరో రోజూ ఎటువంటి విఘ్నం లేకుండా కొనసాగింది. వేదపండితులు మహాగణపతిపూజతో యజ్ఞాన్ని ప్రారంభించి రుద్రాభిషేకం, శ్రీమహావిష్ణుపూజ, సర్వదేవత అర్చనతో పాటు యజ్ఞాన్ని నిర్వహించారు.

కొత్త జిల్లాకు..


రాం.. రాం..

విద్యుత్ శాఖలో అధికారులు, సిబ్బంది కొరత

కొత్త జిల్లాకు వచ్చేందుకు విముఖత



విద్యుత్ శాఖ ఎస్ఈ కార్యాలయం



పుట్టపర్తిటౌన్, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): జిల్లాకు వచ్చేందుకు విద్యుత్ శాఖ అధికారులు, సిబ్బంది ఆసక్తి చూపట్లేదు. దీంతో చాలా పోస్టులు ఖాళీగా ఉన్నాయి. నూతన జిల్లా ఏర్పడి మూడేళ్లవుతున్నా తగినంత మంది సిబ్బంది, అధికారులు లేరు. వెరసి, వినియోగదారులు, రైతులకు మెరుగైన సేవలు అందడం లేదు. విభజన తరువాత ఉమ్మడి జిల్లాలోని ఏపీఎస్పీడీసీఎల్‌లో పనిచేస్తున్న 50 శాతం మంది అధికారులు, ఉద్యోగులను శ్రీసత్యసాయి జిల్లాకు కేటాయించారు. కొత్త జిల్లాలో చేరేందుకు చాలామంది ఆసక్తి చూపలేదు. దీంతో ఇప్పటికీ జిల్లాలో పూర్తిస్థాయిలో అధికారులు, సిబ్బంది లేరు. జిల్లా విద్యుత్‌శాఖ పరిపాలన కేంద్రమైన ఎస్ఈ కార్యాలయంలోనే అధికారులు, సిబ్బంది కొరత ఉండడం గమనార్హం. చాలామంది అధికారులు అనంతపురంలో స్థిరనివాసాలు ఏర్పాటు చేసుకుని, పిల్లలను అక్కడే చదివించుకుంటున్నారు. దీంతో జిల్లాకు రావడానికి ససేమిరా అంటున్నారు.

ఏఈలు లేరు..

శ్రీసత్యసాయి జిల్లాలో హిందూపురం, పుట్టపర్తి, కదిరి డివిజన్లు ఉన్నాయి. హిందూపురం డివిజన్‌లో 12 మంది ఏఈలకుగాను ఏడుగురు మాత్రమే పనిచేస్తున్నారు. కదిరి డివిజన్‌లో 12 మందికిగాను 8 మంది, పుట్టపర్తి పరిధిలో 13 మందికిగాను 9 మంది పనిచేస్తున్నారు. ఎస్ఈ కార్యాలయంలోనే కమర్షియల్, టెక్నికల్ ఏఈల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. సాంకేతిక సిబ్బంది కొరత కూడా తీవ్రంగా ఉంది. కొంతమంది అవుట్ సోర్సింగ్ ఉద్యోగులతో నెట్టుకొస్తున్నారు.

క్షేత్రస్థాయిలో ఇష్టారాజ్యం

అధికారుల కొరత తీవ్రంగా ఉండడంతో క్షేత్రస్థాయిలో సిబ్బంది, ఉద్యోగులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. అనేకచోట్ల తరచూ విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతున్నా.. పట్టించుకునేవారే లేరు. వ్యవసాయ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోయినా, మరమ్మతులకు లోనైనా, రైతులే వాటిని బాగు చేయించుకోవాల్సి వస్తోంది. ఇప్పుడే పరిస్థితి ఇలా ఉంటే రానున్న వేసవిలో విద్యుత్ సరఫరా ఎలా ఉంటుందో అని వినియోగదారులు, రైతులు ఆందోళన చెందుతున్నారు. క్షేత్రస్థాయిలో మాత్రమే పనిచేయగలిగిన కొంతమంది సిబ్బందిని ఎస్ఈ కార్యాలయానికి కేటాయించడంతో వారితో ఎలా పనిచేయించుకోవాలో అర్థంకాక అధికారులు తలలు పట్టుకుంటున్నారు.

అధికారులు, సిబ్బంది కొరత వాస్తవమే



జిల్లాలో ఏపీఎస్పీడీసీఎల్ పరిధిలో అధికారులు, సిబ్బంది కొరత ఉన్నది వాస్తవమే. ఏఈల కొరత అధికంగా ఉంది. జిల్లా విద్యుత్ కార్యాలయంలో కూడా సాంకేతిక సిబ్బంది చాలినంత మంది లేరు. ఉన్న సిబ్బందితోనే నెట్టుకొస్తున్నాం.

- సురేంద్ర, ఎస్ఈ

స్టాంప్ బ్లాక్

- నాన్ జ్యుడీషియల్ స్టాంపుల కొరత
- ఇదే అదనుగా నాలుగు రెట్ల ధరకు విక్రయం
- వెండర్లతో రిజిస్ట్రేషన్ అధికారుల లాలూచీ?



మడకశిరలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం

మడకశిర టౌన్, గుత్తి, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా నాన్ జ్యుడీషియల్ స్టాంపుల కొరత వేధిస్తోంది. ఆస్తుల రిజిస్ట్రేషన్లు, బ్యాంకు రుణాలు, సిరాస్థి ఒప్పందాలు, అఫిడవిట్లు తదితరాలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. చాలామంది రిజిస్ట్రేషన్లను వాయిదా వేసుకుంటున్నారు. మరికొందరు ఇతర ప్రాంతాలకు వెళ్లి తెచ్చుకుంటున్నారు. గుత్తి నుంచి పామిడి, యాడికి, నంద్యాల జిల్లా ప్యాపిలి తదితర ప్రాంతాలకు వెళుతున్నారు. మడకశిర ప్రాంతంవారు అనంతపురం, హిందూపురం వెళ్లి ప్రయత్నాలు చేస్తున్నారు. గుత్తిలో వారం రోజులుగా స్టాంపుల కొరత కొనసాగుతోంది. అగ్రిమెంటు గడువు దాటిపోతున్న వారు ఆందోళన చెందుతున్నారు. స్టాంపు వెండర్లు కృత్రిమ కొరత

(తరువాయి 7లో..)

పరిష్కరిస్తాం..



స్టాంపుల కొరత పరిష్కారానికి చర్యలు తీసుకొంటున్నాం. ఆన్‌లైన్‌లో చలానా తీసుకోకపోవడం వల్ల సమస్య ఎదురయింది. త్వరలో సమస్యను పరిష్కరిస్తాం. ఇప్పటికే రూ.50, రూ.100 విలువైన నాన్ జ్యుడీషియల్ స్టాంపులు వచ్చాయి. మరికొన్ని రూ.100 స్టాంపులు త్వరలో మా కార్యాలయానికి చేరుతాయి. ఆన్‌లైన్‌లో సమస్య పరిష్కారమైనవెంటనే స్టాంపుల కొరత లేకుండా చూస్తాం.

- సబ్ రిజిస్ట్రార్ నరసింహమూర్తి

ఆధార్ అవస్థలు

పనిచేయని సచివాలయ ఆధార్ కేంద్రాలు

పక్కజిల్లాలు, పట్టణాలకు పరుగులు



ఎన్పీకుంట సచివాలయం

నంబులపూలకుంట, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): గ్రామ సచివాలయాల్లో ఆధార్ కేంద్రాలు పని చేయకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గతంలో ఆధార్ నమోదు, అప్‌డేట్ చేసుకోవడానికి గ్రామ సచివాలయాల్లోనే ఆధార్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. మండలలో మూడు ఆధార్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ప్రస్తుతం ఒక్క ఆధార్ కేంద్రం కూడా పని చేయకపోవడంతో ఆధార్ అప్‌డేట్ అవసరమైన మండల ప్రజలు, విద్యార్థులు పట్టణాలు, పక్క జిల్లాలకు పరుగులు తీస్తున్నారు. అన్ని పనులకు ఆధార్ అవసరమైన నేపథ్యంలో సవరణలకు ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ముఖ్యంగా ఆధార్‌కు మొబైల్ నెంబర్‌ను లింక్ చేయించుకోవాల్సి ఉంది. ఆధార్ కార్డు తీసుకున్న తొలి రోజుల్లో మొబైల్ లేని కారణంగా పలువురు తమకు తెలిసిన వారి నెంబర్లు ఇచ్చారు. ఇప్పుడు సవరించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ప్రస్తుతం ఫార్మర్ రిజిస్ట్రీ నమోదు జరుగుతున్న క్రమంలో ఆధార్‌కు ఫోన్ నెంబర్ లింకు అత్యవసరం అవుతోంది. మండలకేంద్రంలో 1, 2, అలాగే పెడబల్లిలో 3 ఆధార్ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఇక్కడ విధులు నిర్వహిస్తున్న డిజిటల్ అసిస్టెంట్లు ఇద్దరు బదిలీపై వెళ్లిపోయారు. మిగిలిన ఎన్పీకుంట -1 సచివాలయ డిజిటల్ అసిస్టెంట్ సెలవుపై వెళ్లారు. గత రెండునెలలుగా ఆధార్ కేంద్రాలు నిర్వహించకపోవడంతో ప్రజలు చాల ఇబ్బందులు పడుతున్నారు. ఉన్నతాధికారుల ఒత్తిడితో మండలకేంద్రంలో ఉన్న ఓ సచివాలయంలో సెలవుపై ఉన్న డిజిటల్ అసిస్టెంట్ కొన్ని రోజులు పని చేశారు. అయితే ఆధార్ సమస్యలు మాత్రం నిరంతరం వస్తూనే ఉన్నాయి. అందుకే ప్రతిరోజు ఆధార్ కేంద్రం అందుబాటులో ఉండాల్సి ఉంది. ఇప్పటికైనా చాలమంది విద్య, వైద్యం, పింఛన్‌కు సంబంధించి ఆధార్ కార్డులను కొంతవరకు సవరించుకున్నారు. కదిరిలోని బాలికల ఉన్నత పాఠశాలలో ఉన్న ఉచిత ఆధార్ కేంద్రంలో కొందరు అప్‌డేట్ చేసుకోగా మిగిలిన వారు పక్కన ఉన్న అన్నమయ్య జిల్లాలోని గాలివీడుకెళ్లి పోస్టాఫీసులు, ప్రైవేటు ఆధార్ కేంద్రాల్లో డబ్బు చెల్లించి చేయించుకున్నట్లు చెబుతున్నారు.

నాలుగుమార్లు సచివాలయానికి వెళ్లా



ఆధార్ కార్డులో మార్పులు చేయించుకోవడానికి నాలుగుమార్లు సచివాలయానికి వెళ్లా. నాకు నాలుగురు పిల్లలు ఉన్నారు. వారిలో 12 సంవత్సరాలు వయస్సు ఉన్న నసరిన్‌కు ఇంటి నెంబర్ తప్పు పడటంతో మార్చుకోవడానికి పలుమార్లు ప్రయత్నించినా ఫలితం లేకపోయింది. మరో అమ్మాయికి పుట్టిన తేదీని చేతితో రాయడంతో చెల్లడం లేదంటున్నారు. వీటి మార్పులకు పలుమార్లు తిరిగా. ఇక్కడ కేంద్రాలు పనిచేయకపోవడంతో ఇబ్బంది పడుతున్నాం.

- జాకీర్, ఎన్పీకుంట

ప్రతిపాదనలు పంపాం

గతంతో మూడు ఆధార్ కేంద్రాలు పని చేసేవి. ఇద్దరు డిజిటల్ అసిస్టెంట్లు బదిలీపై వెళ్లగా, మరొకరు సెలవుపై వెళ్లారు. డిజిటల్ అసిస్టెంట్ల ఐడీ మ్యాప్ కాకపోవడంతో ఆధార్ కేంద్రాలు కొనసాగించలేకపోయాం. ప్రస్తుతమున్న డిజిటల్ అసిస్టెంట్‌కు ఆధార్ ఐడీ మ్యాప్ చేయాలని జిల్లా కార్యాలయానికి ప్రతిపాదనలు పంపాం. ఉత్తర్వులు రాగానే ఆధార్ కేంద్రాలు పని చేసేలా చూస్తాం.

- అంజినప్ప, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ, ఎన్పీకుంట

మళ్లీ దెబ్బ..!

రైల్వేలైన్ కోసం భూసేకరణ

- ఇది వరకే ఓ ట్రాక్ నిర్మాణం
- రెండింటి మధ్య మిగలనున్న భూమి
- తీవ్ర నష్టం అంటున్న బాధిత రైతులు



బైసాప్ లైన్ కోసం సేకరించనున్న భూమి

గుంతకల్లు, ఫిబ్రవరి19(ఆంధ్రజ్యోతి): రైల్వే బైపాస్ లైన్ కోసం భూమిని కోల్పోతున్న పలువురు రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ముంబై రూటు నుంచి వచ్చే గూడ్సు రైళ్లు గుంతకల్లు రైల్వే స్టేషన్‌లోకి రాకుండా బైపాస్ గుండా విజయవాడ లైన్‌లోకి వెళ్లేలా చేయడానికి ట్రాక్ నిర్మాణానికి అధికారులు భూసేకరణ చేపట్టారు. గుంతకల్లు స్టేషన్‌లో విజయవాడ రైళ్లకు ఇంజన్‌ను మార్చనవసరం లేకుండా చేయడానికి ఇదివరకే ఓ బైపాస్ లైన్‌ను నిర్మించారు. ఆ లైన్ కోసం కసాపురం, గుంతకల్లు రైతులు గతంలో భూములను రైల్వేకు ఇచ్చారు. ఇప్పుడు మరలా పాత లైన్‌కు కొద్ది దూరంలో ఇంకో బైపాస్ లైన్‌ను నిర్మించడానికి రైల్వే అధికారులు తలపెట్టారు. ఇప్పుడు కూడా గతంలో భూములు కోల్పోయిన రైతుల భూములే పోతున్నాయి. దీంతో పాత లైన్‌కు అనుకుని కాకుండా కొద్ది దూరంలో ట్రాక్ నిర్మించడం వల్ల అంటే రెండు ట్రాక్‌ల మధ్య కొంత భూమి మిగిలిపోతుందని, ఇది ఎందుకూ పనికి రాకుండా పోయే ప్రమాదం ఉందని ఆయా రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రైల్వే లైన్‌ను నిర్మిస్తే రైలు వంతెనలు, వ్యవసాయ పైపు లైన్ల విషయంగా ఆ శాఖ నుంచి శాశ్వతంగా సమస్యలు ఎదురవుతూనే ఉంటాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. పాత బైపాస్‌లైన్‌పై నిర్మించిన వంతెన వల్ల తమకు ఎంతో ఇబ్బంది ఉందని, కానీ రైల్వే అధికారులు తమ కష్టాలు పట్టించుకోవడం లేదని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

56 ఎకరాల కోసం సర్వే

గుంతకల్లు-ముంబై లైన్‌లో మొదటి రైల్వే స్టేషన్ అయిన వెస్ట్ గుంతకల్లు వద్ద నుంచి విజయవాడ వైపు నంచెర్ల రైల్వే స్టేషన్ వరకూ రెండో బైపాస్ లైన్ నిర్మాణానికి గత ఏడాది రైల్వే అధికారులు సర్వేచేసి, తమకు కావాల్సిన భూమిలో రాళ్లను పాతారు. యాభైమంది రైతులకు చెందిన 55.8 ఎకరాల భూమిని సేకరించడానికి రెవెన్యూ అధికారులకు విజ్ఞప్తి పంపారు. ఈ మేరకు స్థానిక డివిజనల్ రెవెన్యూ అధికారి శ్రీనివాసులు గత వారంలో రైతులను పిలిపించి చ ర్చించారు. భూమిని కోల్పోనున్న రైతులు తమ అభ్యంతరాలను తెలిపారు. భూములకు బుక్ వ్యాల్యూ ప్రకారం లెక్కగడితే మంచి పంటలు పండే నల్ల రేగడి భూములకు తగిన పరిహారాలు రావని రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. ఎకరాకు కనీసం రూ. 40 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

ఏకపక్షంగా లాక్కుంటే ఎలా?

రైల్వే బైసాప్ లైన్ కోసం అధికారులు తమతో ఏమాత్రం చర్చించకుండా ఏకపక్షంగా భూమిని లాక్కుంటున్నారని రైతులు వాపోతున్నారు. గతంలో నిర్మించిన విజయవాడ బైపాస్ లైన్‌కు అనుకుని ఇంకో బైపాస్ లైన్‌ను నిర్మిస్తే అనుకూలంగా ఉంటుందని రైతులు తెలిపారు. అలా పక్కనుంచి కాకుండా కాస్త దూరంగా రైల్వే లైన్‌ను నిర్మించడానికి ప్లాన్‌ను సిద్ధం చేశారన్నారు. దీని వల్ల లైన్లకు మధ్య మిగిలిపోయిన భూముల వల్ల రైతులకు చాలా నష్టం కలుగుతుందని, వ్యవసాయం చేయడానికి ఇబ్బందికర పరిస్థితులు ఏర్పడతాయని రైతులు వాపోతున్నారు. అవసరమైతే నీటి పైపులను రైల్వే లైన్ల కింద నుంచి వేసుకోవడానికి రైల్వే శాఖాధికారులు ఏమాత్రం అంగీకరించరని రైతులు తెలియజేస్తున్నారు. పైగా భూసేకరణ చేసిన సర్వే నంబర్లను 08 కింద చూపి సమస్యను తెచ్చిపెడతారన్నారు. మిగిలిన భూమిని అమ్ముకోవాలన్నా, తనఖా పెట్టాలన్నా సాధ్యంకాని పరిస్థితులు ఏర్పడతాయని అనుమానాలను వ్యక్తంచేస్తున్నారు.



రైతులకు సమస్యగా మారిన బైపాస్ లైన్‌లోని రైలు వంతెన

ఎకరాకు రూ. 40 లక్షలు చెల్లించాలి: పూల రమణ, రైతు



బాగా పంటలు పండే నల్ల రేగడి భూములను సేకరిస్తున్నారు. హంద్రీనీవా పక్కనే ఉన్నందున భూముల రేట్లు పెరిగాయి. కానీ పుస్తకాలలో ఉన్న రిజిస్ట్రేషన్ విలువలను లెక్కలోకి తీసుకుని పరిహారాలను ఫిక్స్ చేస్తారు. దీని వల్ల రైతులకు నష్టం వాటిల్లుతుంది. అలాగే రైల్వే శాఖకు ఎంత కావలిస్తే అంతమాత్రమే భూమిని సేకరిస్తే బిట్లు మిగిలిపోయి రైతులు నష్టపోతారు. కనుక రైతులకు ఇబ్బంది లేనివిధంగా బిట్లు మిగలకుండా భూమిని రైల్వే శాఖ కొనాలి.

బైపాస్ లైన్ పక్కనే నిర్మించాలి: కేదార్‌నాథ్ రెడ్డి, రైతు



ఇదివరకే నిర్మించిన బైపాస్ లైన్‌కు అనుకుని కొత్త బైపాస్ లైన్‌ను నిర్మించాలి. దీని వల్ల భూమి వృథా కాదు. లేదంటే రైతులకు సమస్యలు తలెత్తుతాయి. అక్కడ కొంచెం.. ఇక్కడ కొంచెం భూమి విడిపోతే వాటికి విలువ కూడా తగ్గిపోతుంది. కనుక రైల్వే అధికారులు ప్లాన్‌ను మార్చి భూమిని సేకరించాలి. రైల్వే లైన్ల కింద ట్రాక్టర్లు, బండ్లు వెళ్లడానికి అనువైన వంతెనలు నిర్మించాలి.

కొనే భూమిని సబ్‌డివిజన్ చేయాలి: వరదరాజులు, రైతు



రైల్వే శాఖ సేకరించే భూమిని సబ్‌డివిజన్ చేసి కొనాలి. లేదంటే డైగ్లాట్‌లో సర్వే నంబర్లు మొత్తం సీజ్ అవుతాయి. దీని వల్ల భవిష్యత్తులో మా భూములను అమ్ముకోలేము. తనఖా పెట్టలేము. కనుక రెవెన్యూ అధికారులు ఈ సమస్యను దృష్టిలో ఉంచుకుని సబ్‌డివిజన్ చేసిన తర్వాత భూమిని సేకరించాలి. గతంలో నిర్మించిన బైపాస్‌లైన్‌లో సరైన వంతెనలు నిర్మించని కారణంగా సమస్యలు ఎదుర్కొంటున్నాము. ఇప్పుడూ అదే పునరావృతం అవుతుందని ఆందోళన చెందుతున్నాం.

త్వరలో సంప్రదిపులు చేపడతాం: శ్రీనివాసులు, గుంతకల్లు ఆర్డీవో



రైతుల భూములను సర్వేచేసి, అభ్యంతరాలు స్వీకరించాం. రైతుల అభ్యంతరాలపై మినిట్స్‌ను రికార్డు చేసి కలెక్టరేట్‌కు పంపాము. త్వరలో జేసీ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి సంప్రదింపుల సంఘం (డీఎల్‌ఎన్‌సీ) ఏర్పాటై రైతులు, రైల్వే అధికారులను పిలిపించి చర్చలు జరుపుతారు. రైతుల అభ్యంతరాలన్నీ తప్పక పరిశీలిస్తాం. కనుక రైతులు ఆందోళన చెందాల్సిన పనిలేదు. రైతులు వారి వాదలను నేరుగా జిల్లా రెవెన్యూ అధికారులు, రైల్వే అధికారులకు తెలియజేయవచ్చు. భూమి ధర విషయంగా కూడా సంప్రదింపులు జరిపే అవకాశం ఉంటుంది.

నేటి నుంచి
బుగ్గరామలింగేశ్వరుడి బ్రహ్మోత్సవాలు

- సర్వాంగ సుందరంగా ఆలయం ముస్తాబు



స్వామివారి మూలవిరాట్

తాడిపత్రి, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రసిద్ధ శైవక్షేత్రమైన బుగ్గరామలింగేశ్వరస్వామి ఆలయంలో మహాశివరాత్రి వార్షిక బ్రహ్మోత్సవాలు గురువారం నుంచి ప్రారంభమై మార్చి 2వ తేదీ వరకు అంగరంగ వైభవంగా జరగనున్నాయి. ఉత్సవాలను కనివినీ ఎరుగని రీతిలో జరిపించడానికి ఎమ్మెల్యే జేసీ అస్మిత్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర‌రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకుంటున్నారు. ఉత్సవాలను పురస్కరించుకుని ఆలయాన్ని రంగురంగుల విద్యుత్‌దీపాలతో సర్వాంగసుందరంగా అలంకరించారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా 20న శైవపుణ్యావాచనం అంకురారోపణం, 21న ధ్వజారోహణం, చిత్రగోపురం, 22న వాసుకీవాహనం, శేషవాహనం, 23న సింహవాహనం, 24న నరమృగవాహనం, 25న గజవాహనం, 26న నందివాహనం, అధికార నంది వాహనంతోపాటు మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని ఆకాశదీపోత్సవం, రాత్రి 12గంటలకు లింగోద్భవం, 27న పార్వతీసమేత బుగ్గరామలింగేశ్వరస్వామి కల్యాణోత్సవం, అనంతరం మహారథోత్సవం, 28న అశ్వవాహనం, మార్చి 1న వసంతోత్సవం, హంసవాహనం, 2న ఏకాంతోత్సవం కార్యక్రమాలతో బ్రహ్మోత్సవాలు ముగియనున్నాయి.

చైన్ స్నాచింగ్

బుక్కరాయసముద్రం, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని చెరువుకట్ట మీద ద్విచక్రవాహనంపై వస్తున్న మహిళ మెడలో ఉన్న బంగారం చైనును గుర్తుతెలియని దుండగులు లాక్కెని వెళ్లిన సంఘటన బుధవారం జరిగింది. గుత్తి మండలం అప్పేదొడ్డి పల్లి గ్రామానికి చెందిన గోవిందరెడ్డి భార్య కోటేశ్వరమ్మ అనంతపురం రూరల్ పరిధిలోని ఉప్పరపల్లి గ్రామంలోని తన పుట్టింటికి మంగళవారం వచ్చారు. పుట్టింటి వారు వడిబియ్యం పెట్టారు. అనంతరం భర్తతో కలిసి అప్పేదొడ్డిపల్లి గ్రామానికి ద్విచక్రవాహనంపై బుధవారం బయల్దేరారు. బుక్కరాయసముద్రం మీదుగా చెరువుకట్టపై వెళ్తుండగా రెడ్ పల్సర్ ద్విచక్రవాహనంలో ఇద్దరు గుర్తుతెలియని దుండగులు వచ్చి కోటేశ్వరమ్మ మెడలో ఉన్న గొలుసును లాక్కొని పోయారు. దాని బరువు 250 గ్రాములు ఉందని బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేశారు. బుక్కరాయసముద్రం సీఐ కరుణాకర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మాలలకు అన్యాయం జరిగితే సహించం

రాష్ట్ర మాల కార్పొరేషన్ చైర్మన్ విజయ్‌కుమార్



మాట్లాడుతున్న విజయ్‌కుమార్

అనంతపురం ప్రెస్‌క్లబ్, ఫిబ్రవరి19(ఆంధ్రజ్యోతి): మాల సామాజికవర్గానికి అన్యాయం జరిగితే సహించబోమని రాష్ట్ర మాల కార్పొరేషన్ చైర్మన్ విజయ్ కుమార్ అన్నారు. జిల్లాకొచ్చిన ఆయన ఎస్సీ కార్పొరేషన్ కార్యాలయ సమావేశపు హాల్‌లో మాల సంఘాలు, ఉద్యోగులతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా విజయ్‌కుమార్ మాట్లాడుతూ వైసీపీ హయాంలో నిర్వీర్యమైపోయిన ఎస్సీ కార్పొరేషన్‌ను పునరుద్ధరిస్తామన్నారు. జీవం పోసి నిరుద్యోగ యువతకు భరోసా కల్పిస్తామన్నారు. కార్పొరేషన్ పరిధిలో ఉండి అన్యాక్రాంతమవుతున్న స్థలాలను కచ్చితంగా కాపాడుతామన్నారు. జిల్లాలో ఎస్సీ కార్పొరేషన్ పరిధిలో ఉన్న స్థలాలను గుర్తించాలన్నారు. కార్పొరేషన్ పరిధిలో ఉన్న భూముల్లో పౌల్ట్రీలు శిథిలమయ్యాయన్నారు. వాటికి పూర్వవైభవం తీసుకొచ్చేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. ఎస్సీ వర్గాల ఆర్థికాభివృద్ధే ధ్యేయంగా పర్యటించి అన్ని అంశాలపై లోతైన అధ్యయనం చేస్తున్నామన్నారు. కార్పొరేషన్ కార్యాలయాల్లో ఎస్సీ అభ్యర్థులకు అందిస్తున్న పథకాలు, సేవలపై సమావేశాలు నిర్వహిస్తున్నామన్నారు. ఇండస్ట్రియల్ పాలసీలో భాగంగా ఉచిత విద్యుత్‌ను పునరుద్ధరిస్తామన్నారు. సమావేశంలో మాల కార్పొరేషన్ డైరెక్టర్ కమలమ్మ, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ రాధిక పాల్గొన్నారు.

- రాష్ట్ర మాల కార్పొరేషన్ చైర్మన్ విజయ్‌కుమార్ ఎస్సీ కార్పొరేషన్ పరిధిలో ఉన్న షాపింగ్ కాంప్లెక్స్‌లను పరిశీలించారు. టవర్‌క్లాక్, కలెక్టరేట్ సమీపంలో ఉన్న పలు షాపింగ్ కాంప్లెక్స్‌లను పరిశీలించి వాటి వివరాలను ఆరా తీశారు.
- జిల్లాకొచ్చిన రాష్ట్ర మాల కార్పొరేషన్ చైర్మన్ విజయ్‌కుమార్ మాల సంఘాల నాయకులు, ఉద్యోగులతో సమావేశం అనంతరం జిల్లా కలెక్టర్ వినోద్‌కుమార్‌ను ఆయన చాంబర్‌లో కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసి జిల్లా పర్యటనలో తన దృష్టికి వచ్చిన సమస్యలు, ఎస్సీ కార్పొరేషన్ పథకాల తదితర వాటిపై చర్చించారు. ఆయనతో పాటు మాల కార్పొరేషన్ డైరెక్టర్ కమలమ్మ, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ రాధికలు ఉన్నారు.

ఆదాయం అంతంతే..

- ఏడాదంతా చీనీ విక్రయాలు
- లక్ష టన్నుల కాయల అమ్మకం
- అన్ సీజన్‌లోనూ మార్కెట్‌కు దిగుబడులు
- అయినా తగ్గిన ఆదాయం





మార్కెట్‌కు వచ్చిన చీనీకాయలు

అనంతపురంరూరల్, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): అనంత చీనీ మార్కెట్‌లో గతేడాది చీనీ విక్రయాలు జోరుగా సాగాయి. ఏడాదంతా విక్రయాలు జరిగాయి. లక్ష టన్నుల కాయలు విక్రయించినట్లు అధికారుల లెక్కలు చెబుతున్నాయి. సీజన్‌తో సంబంధం లేకుండా కాయలు మార్కెట్‌కు రావడం యార్డుకు కొంత కలిసొచ్చింది. అన్ సీజన్‌లో సైతం మార్కెట్‌కు కాయలు వచ్చాయి. ఆదాయం మాత్రం అంతంత మాత్రంగానే రావడం గమనార్హం. సీజన్‌లో ఆశించినస్థాయిలో కాయలు మార్కెట్‌కు రాకపోవడం మార్కెట్ ఆదాయంపై పడింది.

సీజన్‌లో తగ్గినా.. అన్ సీజన్ మార్కెట్‌కు కాయలు..

చీనీ మార్కెట్ సీజన్ జనవరి, ఫిబ్రవరి నుంచి మొదలై సెప్టెంబరు వరకు కొనసాగుతుంది. గతేడాది మార్చిలో 17,909, మే నెలలో 18,116, జూన్‌లో 16,591, జూలైలో 21,482 టన్నుల చీనీ విక్రయాలు జరిగాయి. మిగిలిన నెలల్లో ఆశించిన స్థాయిలో మార్కెట్‌కు చీనీకాయలు రాలేదని అధికార వర్గాలు పేర్కొంటున్నాయి. 2023 ఏడాదితో పోల్చుకుంటే.. గతేడాది కాయలు తగ్గిపోవడంతో..యార్డు ఆదాయం కొంతవరకు తగ్గినట్లు తెలుస్తోంది. అధికారుల లెక్క ప్రకారం రూ.6 లక్షల నుంచి రూ.7లక్షల మేర ఆదాయం తగ్గినట్లు చెబుతున్నారు. అన్ సీజన్‌లో కాయలు రావడం మార్కెట్ యార్డుకు కొంత వరకు కలిసొచ్చిందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. సాధారణంగా అక్టోబరు, నవంబరు, డిసెంబరు నెలల్లో చీనీకి అన్ సీజన్. ఈసారి ఈ మూడు నెలల్లోనూ మార్కెట్‌కు కాయలు వచ్చాయి. 2,295 టన్నుల కాయలు అన్‌సీజన్‌లో మార్కెట్‌కు వచ్చాయి. దీంతో రూ.3 లక్షల వరకు ఆదాయం వచ్చిందంటున్నారు.

యార్డుకు రూ.1.67 కోట్ల ఆదాయం..

గడిచిన ఏడాది చీనీ మార్కెట్ ద్వారా రూ.1.67 కోట్ల ఆదాయం యార్డుకు వచ్చింది. గతేడాది జనవరి నుంచి ఈ ఏడాది గత నెల వరకు మార్కెట్‌కు చీనీ కాయలు వచ్చాయి. ఏడాదంతా 99,357 టన్నులు వచ్చాయి. దీంతో మార్కెట్ యార్డుకు యూజర్ చార్జెస్ రూపంలో రూ.1.67 కోట్లు వచ్చింది. ఏప్రిల్‌లో రూ.35.88 లక్షలు, మే నెలలో రూ.35.94 లక్షలు, జూన్‌లో రూ.31.99 లక్షలు, జూలైలో రూ.24.97 లక్షలు ఎక్కువగా ఆదాయం వచ్చింది. అన్ సీజన్ నెలలైన నవంబరులో రూ.3.56 లక్షలు, డిసెంబరులో రూ.1.67 లక్షల ఆదాయం సమకూరడం యార్డు ఆదాయానికి కొంత ఊరటనిచ్చింది.

మార్కెట్‌కు వచ్చిన చీనీకాయలు సమకూరిన ఆదాయం వివరాలివీ..

నెల	వచ్చిన టన్నులు	యూజర్ చార్జెస్ రూపంలో వచ్చిన సొమ్ము (రూపాయల్లో..)
జనవరి-2024	20	9,700
ఫిబ్రవరి-2024	934	1,08,000
మార్చి-2024	10,644	15,44,564
ఏప్రిల్-2024	17,909	35,88,100
మే-2024	18,116	35,94,500
జూన్-2024	16,591	31,99,700
జూలై-2024	21,482	24,97,250
ఆగస్టు-2024	10,189	14,26,460
సెప్టెంబరు-2024	753	1,36,300
అక్టోబరు-2024	86	31,460
నవంబరు-2024	1,475	3,56,430
డిసెంబరు-2024	734	1,67,870
జనవరి-2025	424	76,750
మొత్తం	99,357	1,67,37,084

సీజన్‌లో ఆశించిన స్థాయిలో కాయలు రాలేదు



ఏడాదంగా మార్కెట్‌కు చీనీకాయలు వచ్చాయి. ఇది మార్కెట్‌కు ఆదాయం పరంగా మేలు చేసింది. సీజన్‌లో అనుకున్న మేర చీనీ ఉత్పత్తులు మార్కెట్‌కు రాలేదు. అంతకు మునుపు ఏడాది కంటే తక్కువగానే వచ్చాయి. ఈ క్రమంలో యార్డుకు కొంత ఆదాయం తగ్గింది. అన్ సీజన్‌లో కాయలు వచ్చాయి. ఈక్రమంలో సీజన్‌లో తగ్గిన ఆదాయాన్ని కొంత వరకు పూడ్చుకోగలిగాం.

- గోవిందు, ఎంపికశ్రేణి కార్యదర్శి, వ్యవసాయ మార్కెట్ యార్డు, అనంతపురం

థ్యాంక్యూ సీఎం సర్..!

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం

రామగిరి, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): నసనకోట గురుకుల పాఠశాలను జూనియర్ కాలేజీగా అప్‌గ్రేడ్ చేసినందుకు కృతజ్ఞతగా సీఎం చంద్రబాబు చిత్రపటానికి ఎమ్మెల్యే పరిటాల సునీత, విద్యార్థినులు క్షీరాభిషేకం చేశారు. గురుకుల సందర్శనకు బుధవారం వెళ్లిన ఎమ్మెల్యేకు విద్యార్థినులు, సిబ్బంది ఘనంగా స్వాగతం పలికారు. అప్‌గ్రేడేషన్ వెనుక ఎమ్మెల్యే కృషి ఎంతగానో ఉందని ధన్యవాదాలు తెలిపారు. రామగిరి ప్రాంతంలో ఇంటర్ చదివే అవకాశం లేక చాలామంది బాలికలు చదువు మానేస్తున్నారని, ఈ విషయాన్ని సీఎం చంద్రబాబు, మంత్రి సవిత దృష్టికి తీసుకెళ్లి జూనియర్ కాలేజీగా అప్‌గ్రేడేషన్ తెచ్చామని పరిటాల సునీత అన్నారు. డీఎస్పీ హేమంత్‌కుమార్ విద్యార్థిను పెన్నులను బహూకరించారు. టీడీపీ మండల కన్వీనర్ సుధాకర్, మండ ప్రధాన కార్యదర్శి మారుతీప్రసాద్, నసనకోట ఉప సర్పంచ్ గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులతో కలిసి చంద్రబాబు చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే పరిటాల సునీత

జేఎన్‌టీయూ వీసీ బాధ్యతల స్వీకరణ



వీసీగా బాధ్యతలు స్వీకరిస్తున్న ప్రొఫెసర్ సుదర్శనరావు

అనంతపురం సెంట్రల్, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): జేఎన్‌టీయూ నూతన వీసీగా ప్రొఫెసర్ సుదర్శనరావు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. కార్యాలయంలో పూజలు నిర్వహించి కుటుంబ సభ్యులు, అధికారులు, సిబ్బంది ఆధ్వర్యంలో ఆయన బాధ్యతలు స్వీకరించారు. దీంతో ఆయనకు అభినందనలు వెల్లువెత్తాయి. రిజిస్ట్రార్ ప్రొఫెసర్ క్రిష్ణయ్య, ఓస్‌డీటూ వీసీ ప్రొఫెసర్ దేవన్న, డైరెక్టర్లు, ప్రిన్సిపాళ్లు బోధన, బోధనేతర సిబ్బంది సుదర్శనరావుకు పుష్పగుచ్ఛాలంద జేసి శుభాకాంక్షలు తెలిపారు. పలువురు ప్రముఖులు, సంఘాల నాయకులు వీసీని కలిసి అభినందనలు తెలియజేశారు.

విద్యార్థి నుంచి గురువుగా..

1983లో జేఎన్టీయూ ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ సివిల్ ఇంజనీరింగ్ పూర్తిచేసిన సుదర్శనరావు అదే కళాశాలలో ఆ సంవత్సరం ఆగస్టున అడహక్ ప్రాతిపదికన టీచింగ్ అసిస్టెంట్‌గా ఉద్యోగ జీవితాన్ని ప్రారంభించారు. అసిస్టెంట్ ప్రొఫెసర్, అసిసోసియేట్ ప్రొఫెసర్, ప్రొఫెసర్‌గా అంచెలంచెలుగా ఎదిగారు. 42ఏళ్ల వృత్తి జీవితంలో ఎన్నో పదవులు నిర్వహించి వాటికి వన్నె తెచ్చారు. దేశంలోని పదిమంది సీనియర్ ప్రొఫెసర్లలో ఒకరిగా గుర్తింపు పొందారు. 32ఏళ్ల పరిపాలనా అనుభవంలో 271 పరిశోధనా పత్రాలు ప్రచురించి రూ.469కోట్ల విలువైన ప్రాజెక్టులు పూర్తిచేశారు. సివిల్ ఇంజనీరింగ్ విభాగం ప్రస్తుత హెచ్‌ఓడీ అజిత, డైరెక్టర్ ప్రొఫెసర్ వైశాలి గోర్పాడే, మాజీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ శశిధర్, మాజీ వీసీ రంగజనార్దన, ప్రొఫెసర్ అరుణ కాంతి లాంటి వారంతా సుదర్శనరావు శిష్యులు కావడం గమనార్హం.

ఆస్పత్రిలో తిట్ల దండకం

రాయదుర్గం, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): బొమ్మనహాళ్ ప్రభుత్వ వైద్యశాలలో వైద్యులు, సిబ్బంది మధ్య జరుగుతున్న అంతర్గతపోరు తారస్థాయికి చేరింది. ఎవరైనా వింటే అసహ్యించుకుంటారనే ధ్యాస కూడా లేకుండా బుధవారం బాహాటంగా దూషణలకు దిగారు. 'ఆంధ్రజ్యోతి'లో బుధవారం ప్రచురితమైన 'జీతం చాలదని సైడ్ బిజినెస్' అనే కథనంపై వైద్య శాఖలో తీవ్ర చర్చ సాగింది. ఈక్రమంలోనే విధులు నిర్వహిస్తున్న ఇద్దరు ప్రభుత్వ వైద్యులు ఒకరిపై ఒకరు నెపాన్ని వేసుకునే ప్రయత్నం చేశారు. ఆ ఆస్పత్రికి చికిత్స కోసం వచ్చిన రోగులు తెలిపిన మేరకు ..డ్రాయింట్ అధికారిగా ఉన్న శ్రీలక్ష్మీ మరో వైద్యాధికారిణి మల్లేశ్వరికి మెమో జారీ చేశారు. మెమో కాపీని అక్కడున్న సీనియర్ అసిస్టెంట్ సోమశేఖర్‌కు ఇచ్చి, ఓపీకి హాజరు కాకుండానే వెళ్లిపోయారు. కొద్దిసేపటి తర్వాత ఓపీ సేవలకు వచ్చిన డాక్టర్ మల్లేశ్వరి మెమో కాపీని తీసుకుని చించేసి చెత్తబుట్టలో పారేశారు. నాకు మెమో ఇచ్చేంత స్థాయి శ్రీలక్ష్మికి ఎక్కడుందని ఆగ్రహంతో తిట్ల దండకాన్ని అందుకున్నారు. దీంతో అక్కడే ఉన్న వైద్య సిబ్బంది, రోగులు నివ్వెరపోయారు.పేదల వైద్యం కోసం ప్రభుత్వం కోట్లాది రూపాయలతో ఆస్పత్రులు కట్టించి, వైద్యసేవలందించడానికి సిబ్బందిని నియమిస్తే వీరు చేసే పని ఇదా అంటూ పలువురు రోగులు పెదవి విరిచారు.

శిక్షణను ఉపయోగించుకోండి

అనంతపురం ప్రెస్‌క్లబ్, ఫిబ్రవరి19(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం సీడాప్ ద్వారా స్వయం ఉపాధికి అందించే ఉచి త శిక్షణను ఉమ్మడి జిల్లాలోని మైనార్టీ నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని మైనార్టీ కార్పొరేషన్ ఈడీ సు బ్రహ్మణ్యం బుధవారం కోరారు. ఆసక్తి గల యువత ధ్రువపత్రాల జిరాక్స్ కాపీలతో మైనార్టీ కార్పొరేషన్ కార్యాలయం లో దరఖాస్తులను అందజేయాలన్నారు. వివరాలకు 9849901138కు సంప్రదించాలన్నారు.

23న సాయిప్రుడెంట్ స్కాలర్‌షిప్ పరీక్ష

పుట్టపర్తి రూరల్, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): ప్రతిభావంతులైన విద్యార్థులకు ఎంబీఏ కోర్సును ఉచితంగా అందించడమే లక్ష్యంగా ఈనెల 23న సాయిప్రుడెంట్ స్కాలర్‌షిప్ పరీక్ష నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ బాలకోటేశ్వరి తెలిపారు. ఈమేరకు అడ్మిషన్సు డెరెక్టర్ ప్రశాంతితో కలిసి బీడుపల్లి సంస్కృతి స్కూల్ ఆఫ్ఇంజనీరింగ్‌లో పరీక్ష పోస్టర్‌ను బుధవారం విడుదల చేశారు. జర్మనీలోని అనాహిత స్టిఫ్టుంగ్‌ఫౌండేషన్ వారు ఈ పరీక్షను నిర్వహించనున్నట్లు తెలిపారు. పరీక్షలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు రెండేళ్ల ఎంబీఏ కోర్సుతో పాటు హాస్టల్ సదుపాయం పూర్తి ఉచితంగా అందిస్తామన్నారు. పరీక్ష ఉదయం 9 గంటలకు ప్రారంభమవుతుందన్నారు. అర్హులైన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు. వివరాల కోసం అభ్యర్థులు సెల్ నంబర్లు 9100064545/9100974544/9100974537ను సంప్రదించాలని సూచించారు.



పరీక్ష పోస్టర్‌ను విడుదల చేస్తున్న ప్రొఫెసర్ ప్రశాంతి

ప్రాణం తీసిన ఆన్‌లైన్ జూదం

రైలుకింద పడి యువకుడి ఆత్మహత్య


అశోక్ (ఫైల్)

ధర్మవరం, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): ఆన్‌లైన్ జూదం ఓ యువకుడి ప్రాణం తీసింది. హిందూపురం రైల్వే పోలీసులు, కుటుంబసభ్యులు తెలిపిన మేరకు పట్టణంలోని సత్యసాయి నగర్‌కు చెందిన యనమల అశోక్(32) రియల్‌ఎస్టేట్ వ్యాపారం చేసేవాడు. రెండు రోజుల కిందట ఇంటిని తనఖా పెట్టి బ్యాంక్‌లో రూ.8లక్షలు రుణం తీసుకున్నాడు. ఇందులో రూ.2లక్షలు అప్పు చెల్లించాడు. రూ.లక్ష భార్య ధరణి ఖాతాలో జమచేశాడు. మిగిలిన రూ.5లక్షలతో ఇటుకల బట్టిని ఏర్పాటు చేసుకోవాలని నిర్ణయించుకున్నాడు. అయితే ఆన్‌లైన్ జూదం అలవాటు ఉన్న అశోక్ రెండు రోజుల్లో మొత్తం సొమ్ము పోగొట్టుకున్నాడు. ఈ విషయం కుటుంబసభ్యులకు చెప్పుకోలేక తీవ్రంగా మథపడ్డాడు. ఈక్రమంలోనే మంగళవారం బ్యాంకులో బంగారు తాకట్టు పెట్టి డబ్బులు తెస్తానని ఇంట్లో చెప్పి వెళ్లాడు. మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో భార్యకు ఫోన్‌చేసి రావడానికి లేటు అవుతుందని చెప్పాడు. సాయంత్రమైనా రాకపోవడంతో కుటుంబసభ్యులు ఫోన్ చేస్తే నాట్ రీచ్‌బుల్ అని వచ్చింది. దీంతో వారు ఆందోళనతో అతడిని వెతకడం ప్రారంభించారు. అయితే మంగళవారం రాత్రి అశోక్ తన ద్విచక్ర వాహనాన్ని కేతిరెడ్డికాలనీ సమీపంలోని ట్రాక్ వద్ద ఉంచి రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. దీన్ని బుధవారం తెల్లవారు జామున గమనించిన రైల్వేకీమన్ హిందూపురం రైల్వే పోలీసులకు సమాచారం అందించాడు. వారు ఘటనా స్థలానికి చేరుకుని, పట్టాల సమీపంలో ఉన్న ద్విచక్రవాహనంలో ఉన్న ఆధారాలను బట్టి మృతుడు అశోక్ కుటుంబసభ్యులకు సమాచారం అందించాడు. దీంతో కుటుంబసభ్యులు అక్కడికి వెళ్లి మృతదేహాన్ని గుర్తించి బోరున విలపించారు. అనంతరం అశోక్ భార్య ధరణి ఫిర్యాదు మేరకు హిందూపురం రైల్వే జమేదార్ శ్రీనివాసులు కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని ధర్మవరం ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

వృద్ధురాలిపై దాడి

12 తులాల బంగారం చోరీ


చికిత్స పొందుతున్న లక్ష్మమ్మ

ఓబుళదేవరచెరువు, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): వృద్ధురాలిపై దాడిచేసి 12 తులాల బంగారం చోరీ చేసిన సంఘటన మండల కేంద్రంలో మంగళవారం రాత్రి జరిగింది. బాధితురాలి బంధువులు తెలిపిన మేరకు.. పోలీస్ స్టేషన్ సమీపంలోని పాత పెట్రోల్ బంక్ వద్ద రిటైర్డ్ ప్రభుత్వ ఉద్యోగి లక్ష్మమ్మ ఒంటరిగా నివాసం ఉంటోంది. ఈ విషయం గుర్తించిన దుండగులు మంగళవారం రాత్రి ఇంటి తలుపు తట్టారు. ఆమె తలుపులు తీసిన వెంటనే దుండగుడు చేతిలో ఉన్న సుత్తితో తలపై కొట్టి, గుంతు నులిమాడు. దీంతో ఆమె స్పృహ కోల్పోయింది. ఆమె మెడలో ఉన్న నాలుగు తులాల బంగారం చైన్ చేతులకు ఉన్న నాలుగు గాజులు(8 తులాలు) తీసుకుని ఉడాయించారు. కొద్దిసేపటి తరువాత స్పృహలోకి వచ్చిన ఆమె తన కుమార్తెకు ఫోన్ చేసి, విషయం చెప్పింది. కుమార్తె బంధువులతో అక్కడికి చేరుకుని గాయపడిన లక్ష్మమ్మను కదిరి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించింది. బాధితురాలు లక్ష్మమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ మల్లికార్జునరెడ్డి తెలిపారు.

అహుడా వార్డు ప్లానింగ్ సెక్రటరీ ఆత్మహత్య

అనుమానం ఉందంటూ తల్లి ఫిర్యాదు


నాగశ్రీ (ఫైల్)

అనంతపురం క్రైం, ఫిబ్రవరి19(ఆంధ్రజ్యోతి): అహుడా వార్డు ప్లానింగ్ సెక్రటరీ నాగశ్రీ(32) ఈనెల 18న ఆత్మహత్య చేసుకుంది. ఆమె మృతిపై అనుమానం ఉందంటూ నాగశ్రీ తల్లి.. పోలీసులకు ఫిర్యాదు చేసింది. నాలుగో పట్టణ పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. స్థానిక మారుతీనగర్ మొదటి క్రాస్‌కు చెందిన నాగశ్రీ, మూడో క్రాస్‌కు చెందిన ద్వారకేశ్ ఐదేళ్ల క్రితం ప్రేమించి, పెళ్లి చేసుకున్నారు. నాగశ్రీ నగరపాలక సంస్థలో ఉద్యోగం సంపాదించింది. కార్పొరేషన్ నుంచి అహుడా వార్డు ప్లానింగ్ రెగ్యులేషన్ సెక్రటరీగా రెండేళ్ల క్రితం డిప్యుటేషన్‌పై వచ్చి పని చేస్తుండేది. భర్త సాఫ్ట్‌వేర్ ఇంజినీర్. వారికి మూడున్నరేళ్ల పాప సంతానం. మూడు రోజులుగా భర్తకు అనారోగ్యం అంటూ నాగశ్రీ సెలవు పెట్టింది. మంగళవారం విధులకు హాజరుకాలేదు. మధ్యాహ్నం సమయంలో బ్యాంకుకు వెళ్దామనీ, రెడీ కావాలని బయట పనిచూసుకుని వస్తానని నాగశ్రీకి భర్త చెప్పి వెళ్లాడు. తర్వాత కాసేపటికే తల్లి పద్మావతి.. ద్వారకేశ్‌కు ఫోన్ చేసి నాగశ్రీ ఉరి వేసుకుందని తెలిపింది. వెంటనే ఇంటికి చేరుకున్న అతడు.. తన తల్లిదండ్రులతో కలిసి తలుపులు బద్దలుకొట్టి గదిలోకి ప్రవేశించి, నాగశ్రీనికి కిందికి దించారు. ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. చికిత్స పొందుతూ ఆమె రాత్రి 10 గంటల సమయంలో మృతి చెందింది. దీనిపై అనుమానం ఉందంటూ నాగశ్రీ తల్లి శైలామణి ఫిర్యాదు చేసింది. కొన్ని రోజుల క్రితం వడిబియ్యం కార్యక్రమానికి తమ ఇంటికి కూతురిని పంపాలని కోరితే నిరాకరించారని ఫిర్యాదులో పేర్కొంది. ఆత్మహత్యపై నాలుగో పట్టణ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ప్రాణాలు పోతే.. మాకేంటి..?



ఎన్టీఆర్ వైద్యసేవలో దోపిడీ

> అదనంగా డబ్బులిస్తేనే వైద్యం
>
> ఇవ్వకపోతే అడ్మిషన్, చికిత్సకు ససేమిరా
>
> బరితెగిస్తున్న ప్రైవేటు, కార్పొరేట్ ఆస్పత్రులు
>
> గాలిలో కలిసిపోతున్న పేదల ప్రాణాలు
>
> మామూళ్ల మత్తులో యంత్రాంగం మౌనం

అనంతపురం టౌన్, ఫిబ్రవరి19 (ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ వైద్యసేవ పేరుతో ప్రభుత్వం ఉచిత వైద్యం అందిస్తోంది. గత వైసీపీ ప్రభుత్వం రూ.వేలకోట్ల బిల్లులు పెండింగ్ పెట్టిపోగా.. వాటిని కూడా కూటమి ప్రభుత్వం చెల్లిస్తోంది. ఈ పథకం ద్వారా రూ.25 లక్షలవరకు ఉచిత వైద్యసేవలు పొందేలా అవకాశం కల్పించింది. ప్రభుత్వ ఆశయానికి పలు ఆస్పత్రుల యాజమాన్యాలు తూట్లు పొడుస్తున్నాయన్నది బహిరంగ రహస్యమే. పేదల నుంచి దోపిడీ చేస్తూ వారి ప్రాణాలతో చెలగాటం ఆడుతూ జేబులు నింపుకుంటున్నారు.


ఎన్టీఆర్ వైద్యసేవకు అదనపు వసూళ్లపై జిల్లా వైద్యాధికారి కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న సీపీఐ శ్రేణులు (ఫైల్)

ఉచితం అంటూనే.. వసూళ్లు..

ఎన్టీఆర్ వైద్యసేవ కింద ప్రతి ఒక్కరికి ఉచితంగానే వైద్యం అందించాల్సి ఉంటుంది. ఏవ్యాధికి ఎంత ఖర్చవుతుందో ప్రభుత్వం ముందుగానే నిర్ణయించి ఉంటుంది. చికిత్స అనంతరం బిల్లులు పెడితే నేరుగా ఆస్పత్రికి డబ్బు మంజూరు చేస్తుంది. జిల్లాలోని ప్రైవేటు, కార్పొరేట్ ఆస్పత్రుల్లో మాత్రం ఎన్టీఆర్ వైద్యసేవ కింద చేరిన రోగుల నుంచి అదనపు వసూళ్లకు తెగబడుతున్నారు. ఇదేమి న్యాయమని ప్రశ్నిస్తే 'ఆ వ్యాధికి తక్కువ ధరకు వైద్యం అందించలేమ'ని తెగేసి చెబుతున్నారు. ఇంకొన్ని ప్రైవేటు, కార్పొరేట్ ఆస్పత్రులైతే వైద్యసేవ కింద ఉచిత వైద్యం అందించడం లేదని చెప్పి కర్కశంగా వ్యవహరించి, పంపించేస్తున్నారు. ఈనేపథ్యంలో కొందరు సీరియస్ వ్యాధి పీడితులు ప్రాణాలు కోల్పోతున్నారు.


ఎన్టీఆర్ వైద్యసేవ ద్వారా ఉచితంగా ఆపరేషన్ చేస్తామని తన భర్తను చంపేశారంటూ కావేటీ ఆస్పత్రి ముందు బైఠాయించిన కవిత, బంధువులు(ఫైల్)

అనంతపురం రూరల్ పరిధిలోని ఓ కార్పొరేట్ ఆస్పత్రిలో గత నెలలో ఓ పేషెంట్‌కు ఎన్టీఆర్ వైద్యసేవ అర్హత ఉన్నా.. అదనంగా డబ్బు డిమాండ్ చేశారు. వైద్యసేవ వర్తిస్తున్నపుడు అదనంగా ఎందుకివ్వాలని ప్రశ్నించగా.. చికిత్స చేయడానికి నిరాకరించారట. ఆ తర్వాత మరో ప్రైవేటు ఆస్పత్రిలో చేరి చికిత్స చేయించుకున్నారు. దీనిపై స్పందనలో కలెక్టర్ వినోద్ కుమార్‌కు ఫిర్యాదు చేశారు. దానిపై స్పందన లేకపోవడంతో సీపీఐ శ్రేణులు.. బాధితులతో కలిసి జిల్లా వైద్యాధికారి కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు.

జిల్లా కేంద్రంలోని అరవిందనగర్‌లో గల కావేటి మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రికి ప్రమాదంలో కాలు విరిగిన బ్రహ్మాచారి అనే బాధితుడిని కుటుంబసభ్యులు తీసుకెళ్లారు. ఎన్టీఆర్ వైద్యసేవ ఆమోదం రాలేదని ఆపరేషన్ చేయడంలో నిర్లక్ష్యం వహించారు. ఫలితంగా బ్రహ్మాచారి మరణించాడు. అంతటితో ఆగకుండా ఆస్పత్రి ఫీజు పేరుతో రూ.13వేలు, ఎన్టీఆర్ వైద్యసేవ కార్డు పేరుతో రూ4,500 తీసుకున్నారని బాధితుడి భార్య ఆరోపిస్తూ ఆస్పత్రి వద్ద పసిపాప, బంధువులతో కలిసి ఆందోళన చేపట్టారు.

సాయినగర్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో డెలివరీ కోసం వెళితే ముందుగా రూ.15 వేలు డబ్బు కట్టించుకున్నారని అనంతపురంరూరల్ మండలం పాపంపేటకు చెందిన ఓ వ్యక్తి తెలిపాడు. ఇవి మచ్చుకు కొన్ని మాత్రమే. జిల్లాలో ఎన్టీఆర్ వైద్యసేవ అమలవుతున్న ప్రతి ప్రైవేటు ఆస్పత్రిలో ఇలాగే పేదరోగుల నుంచి అదనంగా డబ్బు దండుకుని, జేబులు నింపుకుంటున్నారు.

మౌనం ఎందుకో?

జిల్లాలో నిత్యం ఎన్టీఆర్ వైద్యసేవ కేసుల విషయంలో ఎక్కడో ఒకచోట వివాదాలు తలెత్తుతూనే ఉన్నాయి. అప్పుడు రోగులబంధువులు ఆందోళన చేస్తున్నారు. ఆ సమయంలో మాత్రం సంబంధిత వైద్యాధికారులు సీరియస్‌గా వెళ్లడం, చర్యలు తీసుకుంటామని ప్రగల్భాలు పలకడం, తిరిగి రావడం, తర్వాత మిన్నకుండిపోవడం రివాజుగా మారింది. రేషన్ కార్డులేనోళ్లు వస్తే వారిపేరున సీఎంసీసీ కార్డుకు సీఎం ఆఫీస్‌కు పెట్టుకుంటున్నారు. ఎన్టీఆర్ వైద్యసేవ జిల్లా యంత్రాంగం సైతం దానిని అప్రూవ్ చేస్తోంది. వైద్యం విషయం కావడంతో సీఎంఓ వెంటనే స్పందించి, ఆ కార్డుకు ఆమోదం తెలుపుతోంది. ఈ కార్డు ముసుగులో కూడా పేషెంట్ల నుంచి డబ్బు గుంజుతున్నారు. ఈ వ్యవహారంలో ఆయా ఆస్పత్రుల నుంచి మామూళ్లరూపంలో డబ్బు ముడుతుండడంతోనే అధికారులు మౌనంగా ఉండిపోతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు సీరియస్‌గా తీసుకుని, పేదలకు ఉచితంగా వైద్యం అందేలా చూడాల్సిన అవసరం ఉంది.

అదనంగా వసూలు చేస్తే చర్యలు



పేదలకు ఉచితంగా వైద్యం అందించాలనే ఎన్టీఆర్ వైద్యసేవను అమలు చేస్తున్నాం. ప్రైవేటు, కార్పొరేట్ ఆస్పత్రుల్లో రోగులకు ఉచితంగానే వైద్యం అందించాల్సి ఉంటుంది. అదనంగా డబ్బు వసూలు చేస్తున్నారనే ఫిర్యాదులు వస్తున్నాయి. ఇప్పటికే పలు ఆస్పత్రులపై విచారణ చేసి, బాధితులకు డబ్బు వాపసు ఇప్పించాం. ఆస్పత్రులపై జరిమానాలు సైతం విధించాం. కొన్నింటికి ఎన్టీఆర్ వైద్యసేవ అనుమతులు రద్దు చేశాం. డబ్బు వసూలుపై మా దృష్టికి తీసుకొస్తే ఆ ఆస్పత్రిపై చర్యలు తీసుకుంటాం.

-డాక్టర్ కిరణ్‌కుమార్ రెడ్డి,
ఎన్టీఆర్ వైద్యసేవ జిల్లా కోఆర్డినేటర్

కార్పెంటర్ ఆత్మహత్యాయత్నం

● విద్యుత్ అధికారుల తీరుతో మనస్తాపం


విద్యుత్ అధికారుల ఎదుట పురుగుల మందు డబ్బాతో కార్పెంటర్ ఇషాక్‌వలి

కణేకల్లు, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): విద్యుత్ అధికారుల తీరుతో మనస్థాపం చెందిన ఓ కార్పెంటర్ ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఈ సంఘటన మండలకేంద్రంలోని విద్యుత్ కార్యాలయంలో బుధవారం చోటు చేసుకుంది. స్థానికుడైన ఇషాక్‌వలి కార్పెంటర్‌గా జీవనం సాగిస్తున్నాడు. కాగా అతడు నిర్వహిస్తున్న సామిల్లుకు గతేడాది ఏప్రిల్ 1వతేదీన విద్యుత్ అధికారులు విద్యుత్ కనెక్షన్ ఇచ్చి మీటర్ బిగించారు. సిబ్బంది ప్రతినెలా రీడింగ్ చేయకుండా మూడునెలల బిల్లు రూ. 79,148ను ఒకేసారి చెల్లించాలని జూలై 5వ తేదీన ఇషాక్‌వలికి అందజేశారు. ఇందుకు ఆందోళన చెందిన అతను అంతబిల్లు తాను చెల్లించలేనని, కాస్తా తగ్గించాలని అప్పటినుంచి విద్యుత్ శాఖ ఉన్నతాధికారుల చుట్టూ తిరుగుతున్నాడు. వారు ఒప్పుకోలేదు. నేరుగా ఎస్ఈని కూడా కలిసి విన్నవించాడు. పలుసార్లు గ్రీవెన్స్‌లో అర్జీలను అందించాడు. ఎవరూ అంగీకరించలేదు. కాగా బుధవారం ఉరవకొండ ఏడీఏ భాస్కర్, ఏఈ శంకర్ నాయక్ అతడి సామిల్లుకు వెళ్లి బిల్లు ఎలాగైనా కట్టాలని సూచించారు. దీంతో తీవ్ర ఆందోళనకు గురైన ఇషాక్‌వలి కొద్దిసేపటి అనంతరం విద్యుత్ కార్యాలయానికి వెళ్లి మూడునెలలకే ఇంత బిల్లు వస్తుందా అని ఆ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశాడు. తన దుకాణంలో అంత విద్యుత్ వాడకం లేదని తెలిపాడు. అయినా అధికారులు వినకపోవడంతో మనస్తాపం చెందిన అతను వెంట తెచ్చుకున్న పురుగుల మందును తాగేందుకు ప్రయత్నించాడు. వెంటనే అధికారులు అడ్డుకుని మరో రెండురోజుల్లో సమస్యను పరిష్కరిస్తామని, ఆందోళన చెందవద్దని చెప్పారు. దీంతో ఇషాక్‌వలి వెనుదిరిగాడు.

2.58 లక్షల మందికి పీఎం కిసాన్ సొమ్ము విడుదల

కొత్తచెరువు, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): శ్రీసత్యసాయి జిల్లాలో 2.58 లక్షల మంది రైతులకు 19వ విడత పీఎం కిసాన్ సొమ్ము రూ.51.51 కోట్లు కేంద్రప్రభుత్వం విడుదల చేసింది. ఆ సొమ్మును ఈనెల 24న ప్రధాని నరేంద్రమోదీ చేతుల మీదుగా జమ చేస్తారని జిల్లా వ్యవసాయాధికారి సుబ్బారావు బుధవారం ప్రకటనలో తెలిపారు.

2.85 లక్షల మందికి..

అనంతపురం అర్బన్: అనంత జిల్లాలోని 2.85 లక్షల మంది రైతులకు రూ.57.02 కోట్లు పీఎం కిసాన్ సొమ్మును ఈనెల 24 ప్రధాని జమ చేస్తారని జిల్లా వ్యవసాయాధికారి ఉమామహేశ్వరమ్మ ప్రకటనలో తెలిపారు.

స్టాంప్ బ్లాక్

(5వ పేజీ తరువాయి)

సృష్టిస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. పలు ప్రాంతాలలో బ్లాక్ చేసి అధిక ధరలకు విక్రయిస్తున్నారు.

నాలుగు రెట్ల ధర..

గుత్తి పట్టణంలో నాన్ జ్యుడీషియల్ స్టాంప్ పేపర్ల కొరత తీవ్రమైంది. ఇదే అదనుగా రూ.100 విలువైన స్టాంప్‌ను రూ.400కు అమ్ముతున్నారు. విషయం తెలిసినా అధికారులు పట్టించుకోవడం లేదు. గుత్తి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం పరిధిలో 14 మంది స్టాంప్ వెండర్లు ఉన్నారు. వీరు ఇండెంట్ పెట్టి స్టాంప్ పేపర్లు కొనుగోలు చేస్తుంటారు. వీటి విలువ ఆధారంగా ప్రభుత్వం కమీషన్ చెల్లిస్తుంది. వీటిని నిర్దేశించిన ధరలకు విక్రయించాలి. కొరతను అనువుగా మార్చుకుని దందాకు తెరలేపారు. ప్లాట్లు, భూముల రిజిస్ట్రేషన్ అత్యవసరంగా చేసుకునేవారు ఎంత ధర ఇచ్చేందుకైనా వెనుకాడటం లేదు. స్టాంప్‌ల కొరత ఉన్నప్పటికీ స్టాక్ వచ్చినప్పుడు తమకు అనుకూలంగా ఉన్న స్టాంప్ వెండర్లకే అధికంగా కేటాయిస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. అధికారులు వారితో లాలూచీ పడుతున్నారని ప్రచారం జరుగుతోంది. అధిక ధరల గురించి ప్రశ్నిస్తే స్టాంప్ పేపర్లు లేవని చెబుతున్నారు. దీంతో గత్యంతరం లేక అడిగినంత ఇస్తున్నామని బాధితులు అంటున్నారు.

ఈ-స్టాంపింగ్ లేక..

మడకశిర నియోజకవర్గంలో రూ.100, రూ.50 స్టాంపులు దొరకడం లేదు. దళారులను ఆశ్రయిస్తే తప్ప పని జరగడం లేదు. వారివద్ద లభించకపోతే రూ.10 స్టాంపు కావాలన్నా 50 నుంచి 100 కి.మీ. దూరం వెళ్లి తెచ్చుకోవాల్సిందే. నాలుగు నెలల నుంచి ఇదే పరిస్థితి ఉన్నా అధికారులు పట్టించుకోవడం లేదు. మడకశిరలో పది మందికిపైగా లైసెన్స్ హోల్డర్లు ఉన్నారు. వీరిలో ఒకరికి మాత్రమే స్టాక్ హోల్డింగ్ సంస్థ ఈ-స్టాంపింగ్‌ను అప్పగించింది. దీంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. మడకశిర సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం పరిధిలో రోజుకు 25 నుంచి 35 రిజిస్ట్రేషన్లు జరుగుతుంటాయి. క్రయ విక్రయదారులు స్టాంపుల కోసం హిందూపురం, అనంతపురం తదితర ప్రాంతాలకు వెళుతున్నారు. అఫిడవిట్‌ల కోసం రూ.10, రూ.20 స్టాంపులు కావాలన్నా దొరకడం లేదు. దీంతో విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. ఈ-స్టాంపింగ్ కోసం కర్నూలుకు వెళ్లి విన్నవించినా స్పందనలేదని స్థానిక వెండర్లు వాపోతున్నారు.

దొరకడం లేదు..



రెండు మూడు నెలలుగా స్టాంపుల కొరతతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. ఈ-స్టాంపింగ్ అందుబాటులో లేవు. నాన్ జ్యుడీషియల్ స్టాంపులు లేవు. రూ.50, రూ.100 స్టాంపులు కావాలంటే హిందూపురం, అనంతపురం వెళ్లాల్సిందే. వైసీపీ ప్రభుత్వంలో తీసుకున్న నిర్ణయాలే దీనికి కారణం. ప్రభుత్వం మారడంతో సమస్య పరిష్కారమవుతుంది అనుకున్నాం. కానీ ఫలితం కనిపించడం లేదు. అధికారులు చొరవ చూపాలి.

-మంజునాథ్, గొడనహళ్లి

రిజిస్ట్రేషన్ వాయిదా వేసుకున్నాం..



స్టాంపుల కొరత వల్ల రిజిస్ట్రేషన్ వాయిదా వేసుకున్నాం. హిందూపురం, అనంతపురం తదితర ప్రాంతాలకు వెళ్లి క్యూలైన్లో నిలబడినా దొరకడం లేదు. ప్రభుత్వానికి ఆదాయం వస్తున్నా కొరత ఏమిటో అర్థం కావడం లేదు. -మంజు, జక్కేపల్లి

నియంత్రించాలి..



గుత్తి పట్టణంలో కొందరు స్టాంప్ వెండర్లు అధిక ధరలకు విక్రయిస్తున్నారు. రూ.100 స్టాంప్‌ను రూ.500కు అమ్ముతున్నారు. రూ.50 స్టాంప్‌ను రూ.300కు విక్రయిస్తున్నారు. ప్రభుత్వ నిబంధనల మేరకు విక్రయించేలా అధికారులు చర్యలు తీసుకోవాలి.

- రంగరాజు, గుత్తి

ఇబ్బంది పడుతున్నాం..



గుత్తి పట్టణంలో నాన్ జ్యుడీషియల్ స్టాంప్‌లు లేవు. రిజిస్ట్రేషన్ కోసం ఇబ్బందులు పడుతున్నాం. అధికారులు స్పందించి వెంటనే స్టాంప్‌లను అందుబాటులో ఉంచాలి.

- ఖాదర్, గుత్తి

టమోటా కిలో రూ.10



అనంతపురంరూరల్, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): స్థానిక కక్కలపల్లి టమోటా మార్కెట్‌లో కిలో టమోటా గరిష్ఠంగా రూ.10తో అమ్ముడుపోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రాంప్రసాద్ తెలిపారు. బుధవారం మార్కెట్‌కు 300 టన్నుల టమోటా దిగుబడులు వచ్చాయని పేర్కొన్నారు. కిలో సరాసరి ధర రూ.9, కనిష్ఠ ధర రూ.7పలికినట్లు ఆయన తెలిపారు.

చీనీ కాయలు టన్ను రూ.23 వేలు

అనంతపురంరూరల్, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): స్థానిక వ్యవసాయ మార్కెట్‌లో బుధవారం చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ.23,390, కనిష్ఠంగా రూ.5,500, సరాసరి రూ.12వేలతో అమ్ముడుపోయినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణికార్యదర్శి గోవిందు తెలిపారు. మార్కెట్‌కు మొత్తంగా 71 టన్నుల చీనీ కాయలు వచ్చాయని పేర్కొన్నారు.

క్షేత్రస్థాయికి వెళ్లండి..

ప్రతిగర్భిణి రికార్డుల్లో నమోదు కావాలి

తల్లీబిడ్డకు పక్కాగా వైద్యసేవలు అందాలి

మాతాశిశు మరణాలకు మీదే బాధ్యత

వైద్యుల సమీక్షలో ఏడీ అనిల్‌కుమార్


ప్రోగ్రాం అధికారులతో సమీక్షిస్తున్న ఏడీ అనిల్‌కుమార్

అనంతపురం టౌన్, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): ప్రోగ్రాం అధికారులు ఆఫీసుల్లో కూర్చోకుండా క్షేత్రస్థాయికి వెళ్లాలనీ, వైద్య పథకాలు, సేవలు ప్రజలకు ఎలా అందుతున్నాయో పరిశీలించాలని వైద్యశాఖ అదనపు సంచాలకుడు (ఏడీ) డాక్టరు అనిల్‌కుమార్ ఆదేశించారు. ఆయన రెండురోజులుగా జిల్లాలో పలు పీహెచ్‌సీలను తనిఖీ చేశారు. బుధవారం సాయంత్రం స్థానిక జిల్లా వైద్యాధికారి కార్యాలయంలో ప్రోగ్రాం ఆఫీసర్లతో సమావేశమయ్యారు. తల్లీబిడ్డ సంక్షేమానికి ఎన్నో పథకాలున్నా.. నేటికీ మాతాశిశు మరణాలు సంభవిస్తుండడం ఏంటని ప్రశ్నించారు. ప్రతి గర్భిణిని రికార్డుల్లో నమోదు చేసుకోవాలన్నారు. ప్రతి వారం, ప్రతినెలా వారికి అవసరమైన వైద్యసేవలు, పరీక్షలు చేయించాల్సిన బాధ్యత ప్రోగ్రాం అధికారులపై ఉందన్నారు. హైరిస్క్ గర్భిణులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఆదేశించారు. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ తల్లీబిడ్డల మరణాలకు కారకులవుతున్నారని మండిపడ్డారు. ఇందుకు సాకులు చెబితే ఒప్పుకునేది లేదనీ, సంబంధిత వైద్యాధికారులు, సిబ్బందిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమావేశంలో జిల్లా వైద్యాధికారి ఈబీ దేవి, ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ యుగంధర్, డాక్టర్ అనుపమజేమ్స్, డాక్టర్ రవిశంకర్, ఎస్ఓ మహమ్మద్ రఫీ, ఎన్‌హెచ్ఎం కిషోర్, డెమోలు త్యాగరాజు, గంగాధర్ పాల్గొన్నారు.

ఇంటర్ విద్యార్థిని ఆత్మహత్య

ఉరవకొండ, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని లత్తవరం తండాలో ఇంటర్ విద్యార్థిని కావ్య(16) ఆత్మహత్యకు పాల్పడింది. ఈశ్వర్‌నాయక్, జానకీబాయి దంపతుల కుమార్తె అయిన కావ్య ఉరవకొండ పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతోంది. కాగా బుధవారం మధ్యాహ్నం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఆమె ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. కొద్దిసేపటికి కుటుంబసభ్యులు వచ్చి చూసి కిందకు దించి పరిశీలించగా.. అప్పటికే మృతి చెందింది. సమాచారం అందుకున్న సీఐ మహానంది సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉరవకొండ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఆత్మహత్యకు కారణాలు తెలియాల్సి ఉంది.

గంజాయి స్వాధీనం

గుంతకల్లుటౌన్, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఆలూరు రోడ్డులో గల గులాంషా ఖాద్రీ దర్గా ఆర్చి వద్ద బుధవారం ముగ్గురు గంజాయి విక్రేతలను అరెస్టు చేసి వారి నుంచి 11వందల గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు వన్‌టౌన్ సీఐ మనోహర్ తెలిపారు. గంజాయి విక్రయిస్తున్నట్లు సమాచారం అందడంతో సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించి ఆ ముగ్గురిని అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు. తర్వాత వారిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరిచినట్లు పేర్కొన్నారు. పట్టణానికి చెందిన షికారి నాగ అలియాస్ నాగులు, అశోక్‌కుమార్, తాడిపత్రికి చెందిన అల్తాఫ్ ఒరిస్సా రాష్ట్రం భువనేశ్వర్ రైల్వే స్టేషన్‌లో గంజాయిని కొనుగోలు చేసి గుంతకల్లుకు తీసుకొచ్చి.. ఇక్కడ చిన్న ప్యాకెట్‌లలో వేసి విక్రయాలు జరుపుతూ పట్టుబడ్డారని సీఐ వివరించారు.

రోజూ లక్ష పని దినాలు నమోదు చేయాలి

అడిగిన ప్రతి కూలీకీ పని కల్పించాలి : సీఆర్డీ కృష్ణతేజ


వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న డ్వామా పీడీ, ఏపీడీలు

అనంతపురం క్లాక్‌టవర్, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): పని అడిగిన ప్రతి కూలీకీ కల్పించాలనీ, రోజూ జిల్లా నుంచి కనీసం లక్ష పనిదినాలు నమోదు చేయాలని రాష్ట్ర గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ (సీఆర్డీ) కృష్ణతేజ ఆదేశించారు. అమరావతి నుంచి బుధవారం ఉపాధి పథకంపై సీఆర్డీ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. సీఆర్డీ కృష్ణతేజ మాట్లాడుతూ.. రోజువారీ కూలీల సంఖ్య పెంచాలనీ, కనీస వేతనం అందేలా చూడాలని ఆదేశించారు. వంద రోజులు పూర్తి చేసుకున్న కుటుంబాల సంఖ్య పెంచాలన్నారు. కరువుమండలాల్లో అదనంగా 50 రోజులు పని దినాలు కల్పించి, నీటికుంటల నిర్మాణాలు చేపట్టాలన్నారు. నీటికుంట నిర్మించుకున్న రైతుకు 10 రకాల పండ్లమొక్కలు, కాయగూరల కిట్లు ఉచితంగా అందజేయాలన్నారు. ఉపాధి సీజన్ ప్రారంభమైనందున లక్ష్యాలను అధిగమించాలని ఆయన ఆదేశించారు. స్థానిక డ్వామా కార్యాలయం నుంచి పీడీ సలీంబాషా, ఏపీడీలు రమేష్‌నాయక్, అయేషా, విజయ్‌కుమార్, చెన్నకేశవయ్య, కృష్ణచైతన్య వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరయ్యారు.

న్యూస్ బాక్స్

సబ్‌జైలులో న్యాయ విజ్ఞాన సదస్సు


మాట్లాడుతున్న డీఎల్‌ఎస్ఏ కార్యదర్శి శివప్రసాద్‌యాదవ్

కదిరి లీగల్, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): స్థానిక సబ్‌జైలులో న్యాయ విజ్ఞాన సదస్సును జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి శివప్రసాద్ యాదవ్ బుధవారం నిర్వహించారు. మొదట ఆయన ఆ సబ్‌జైలును తనిఖీ చేశారు. అనంతరం నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడారు. ఆవేశాన్ని అదుపులో పెట్టుకుంటే అన్ని సమస్యలకు పరిష్కారం లభిస్తుందన్నారు. కార్యక్రమంలో సభ్యులు లోకేశ్వరిరెడ్డి, సిరాజుద్దీన్, జైలు అధికారి వాసుదేవరెడ్డి పాల్గొన్నారు.

దివ్యాంగుల పింఛన్ల పరిశీలన

ధర్మవరం, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): పింఛన్ పొందుతున్న దివ్యాంగులను స్థానిక ప్రభుత్వాస్పత్రిలో వైద్యులు బుధవారం పరిశీలించారు. కూటమి ప్రభుత్వం అనర్హులకు పింఛన్ల ఏరివేతకు శ్రీకారం చుట్టిన విషయం తెల్సిందే. ఇదివరకే మంచానపడిన వారి పింఛన్లను సర్వే చేసింది. ఇందులో భాగంగానే స్థానిక ప్రభుత్వాస్పత్రిలో దివ్యాంగులకు చెందిన సర్టిఫికెట్లను వైద్యులు పరిశీలించారు. ఈ పరిశీలన మార్చి 28వ తేదీ వరకు ఉంటుందని, వారంలో మూడు రోజులపాటు వీటని పరిశీలిస్తామని ఆస్పత్రి సూపరింటెండెంట్ మాధవి తెలిపారు.

రేపు కంటి వైద్యశిబిరం

నంబులపూలకుంట, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): స్థానిక శివాలయం వద్ద కడప పుష్పగిరి కంటి ఆసుపత్రి వైద్యుల ఆధ్వర్యంలో శుక్రవారం కంటి వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు అమరనాథ్‌రెడ్డి బుధవారం ఓ ప్రకటలో తెలిపారు. ఈ శిబిరంలో శుక్లంలకు ఆధునిక ఆపరేషన్, తెల్లకన్ను, రెటీనా, కార్నియా, గ్లూకోమా, కోయ్యకండ, కంటి ప్లాస్టిక్ సర్జరీ, చిన్నపిల్లల కంటి చికిత్స ఆపరేషన్, కంటి నరాల చికిత్స, లెన్స్ తదితర పరీక్షలు చేస్తామన్నారు. శిబిరానికి వచ్చేవారు ఆరోగ్యశ్రీ, ఆధార్, ఫోన్ నెంబర్ తీసుకుని రావాలని కోరారు.

హంద్రీనీవా కాలువ సామర్థ్యం పెంచాలి

పుట్టపర్తిరూరల్, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): హంద్రీనీవా కాలువ సామర్థ్యం పదివేల క్యూసెక్కులకు పెంచి ఆయకట్టుకు నీరందించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి వేమయ్యయాదవ్ బుధవారం ఓప్రకటనలో డిమాండ్ చేశారు. హంద్రీనీవా కాలువకు కాంక్రీట్ లైనింగ్ చేసి రైతులకు నష్టాలకు గురిచేస్తే ఉద్యమాలు చేస్తామన్నారు. హంద్రీనీవా కాలువ సమస్యపై 40 ఏళ్లుగా పోరాటం చేస్తున్నా పరిష్కారం కాలేదన్నారు. సత్యసాయి జిల్లాలో 2.60 లక్షల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందించిన తర్వాతే కుప్పంకు నీరు తీసుకుపోవాలన్నారు. జిల్లాకు 100 టీఎంసీల నీటిని కేటాయించాలన్నారు.

కూటమి ప్రభుత్వం విఫలం


కదిరిఅర్బన్, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): సూపర్ సిక్స్ పథకాలు అమలు చేయడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందని డీసీసీ అధ్యక్షుడు ఎంఎస్ ఇనయతుల్లా విమర్శించారు. బుధవారం పట్టణంలో ఆ పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. రైతుకు రూ.20వేలు, తల్లికి వందనం, మహిళకు మహాశక్తిపథకం, నిరుద్యోగభృతి, మహిళలకు ఉచిత ఆర్టీసీ ప్రయాణం తదితర హామీలను కూటమి ప్రభుత్వం అమలు చేయకుండా నిర్లక్ష్యం చేస్తోందన్నారు. హామీలు వెంటనే అమలు చేయాలని, లేని పక్షంలో ఆందోళనలు చేస్తామని అన్నారు.

పాఠశాలలో హ్యాండ్‌వాష్ యూనిట్ ఏర్పాటు


హ్యాండ్‌వాష్ యూనిట్‌ను ప్రారంభిస్తున్న దాతలు

నంబులపూలకుంట, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): స్థానిక జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థుల సౌకర్యార్థం మాజీ సర్పంచ్ దంపతులు వెంకటరమణమ్మ, సాంబశివ హ్యాండ్‌వాస్ యూనిట్‌ను, నీళ్ల ట్యాంక్‌ను రూ.1.12 లక్షలతో ఏర్పాటు చేశారు. తమ కుమారుడు సాయిరాంరెడ్డి జ్ఞాపకార్థం దీన్ని ఏర్పాటు చేసినట్లు వారు చెప్పారు. కార్యక్రమంలో ఎంఈఓ సుబ్బిరెడ్డి, ఎస్ఐ వలీబాషా, ప్రధానోపాధ్యాయులు శిరీషా, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. దాతలకు వీరు కృతజ్ఞతలు తెలిపారు.

రోడ్డుపక్కన గడ్డికి ఆకతాయిల నిప్పు


గడ్డికి నిప్పుపెట్టడంతో వస్తున్న పొగ

ధర్మవరంరూరల్, ఫిబ్రవరి19(ఆంధ్రజ్యోతి): మండలంలోని చిగిచెర్ల నుంచి ధర్మవరానికి వెళ్లే ప్రధాన రహదారిలో వసంతపురం గ్రామ సమీపంలో రోడ్డుకు ఇరువైపులా ఉన్న గడ్డికి ఆకతాయిలు బుధవారం నిప్పుపెట్టారు. దీంతో దట్టమైన పొగ వస్తుండటంతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. అక్కడున్న పచ్చని చెట్లు కూడా కాలిపోయాయి. రోడ్డుపక్కన ఉన్న పొలాలకు ఆ మంటలు వ్యాపించకుండా రైతులు వాటిని ఆర్పివేశారు.

విద్యార్థులకు కంటి అద్దాల పంపిణీ


కేజీబీవీలో కంటి అద్దాలు పంపిణీ చేస్తున్న డిప్యూటీ డీఎంహెచ్ఓ

ధర్మవరంరూరల్, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని మోటుమర్ల వద్ద ఉన్న కస్తూర్బాగాంధీ పాఠశాలలో విద్యార్థినులకు డిప్యూటీ డీఎంహెచ్ఓ సెల్వియాసాల్మన్, దర్శినమల పీహెచ్‌సీ వైద్యాధికారిణి పుష్పలత, ఆప్తాల్మిక్ ఆఫీసర్ ఉరుకుందప్ప బుధవారం కళ్ల అద్దాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎం శివమ్మ, ప్రిన్సిపల్ చంద్రకళ, ఎంఎల్‌హెచ్‌పీ అనిత, ఆశావర్కర్ పాల్గొన్నారు.

● తాడిమర్రి: స్థానిక కేజీబీవీ, ఉన్నత పాఠశాలలోని 35 మంది విద్యార్థులకు ఎంఈఓ క్రిష్ణమోహన్, డాక్టర్‌హరిత బుధవారం కళ్ల అద్దాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పీఎంఓ సికిందర్, జానకీరాం పాల్గొన్నారు.

భూహక్కు పత్రాలు పక్కాగా ఉండాలి

రెవెన్యూ శాఖ ప్రత్యేక కార్యదర్శి ఆర్‌పీ సిసోడియా



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్‌పీ సిసోడియా

పుట్టపర్తి టౌన్, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): భూముల రీసర్వే తరువాత భూహక్కు పత్రాల్లో ఎటువంటి తేడాలు లేకుండా పక్కాగా చేయాలని రాష్ట్ర రెవెన్యూ శాఖ ప్రత్యేక కార్యదర్శి ఆర్‌పీ సిసోడియా అధికారులను ఆదేశించారు. బుధవారం రాత్రి స్థానిక కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో కలెక్టర్ టీ.ఎస్ చేతన్, జేసీ అభిషేక్ కుమార్‌తో కలిసి జిల్లా అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. భూముల రీసర్వే, రెవెన్యూ సదస్సులు, ప్రజాఫిర్యాదులు, ఫ్రీహోల్డ్ భూముల గురించి ఆరా తీశారు. అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి ఒకే రికార్డుని తయారు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓలు సువర్ణ, మహేష్, ఆనంద్ కుమార్, శర్మ, జిల్లాలోని 32 మండలాల తహసీల్దార్లు, సర్వేయర్లు పాల్గొన్నారు.

● వైసీపీ నేతపై ఫిర్యాదు: జిల్లాలోని కొత్తచెరువు మండలం సర్వేనంబర్ 153లో 9.68 ఎకరాల భూమిని అక్రమ రిజిస్ట్రేషన్‌తో వైసీపీ నాయకుడు కాజేశాడని బాధితుడు పుట్టపర్తికి చెందిన సామ్‌సేన్ సింగ్ రెవెన్యూ ప్రత్యేక కార్యదర్శి సిసోడియాకి ఫిర్యాదు చేశారు. తనకు తెలీయకుండా తన భూమిని నకిలీ పత్రాలతో ఉరవకొండ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో ఎనీవేర్ పద్ధతిలో రిజిస్ట్రేషన్ చేశారన్నారు. ఇందుకు బుక్కపట్నం సబ్‌రిజిస్ట్రార్ సహకరించారన్నారు. దీనికి స్పందించిన సిసోడియా తగు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

నేటి నుంచి దూడలకు టీకాలు

నల్లమాడ, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): మండల వ్యాప్తంగా గురువారం నుంచి దూడలకు బ్రూసిలోసిస్ టీకాలు వేస్తున్నట్లు రెడ్డిపల్లి పశువైద్యాధికారి రవినాయక్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రతి రైతు సేవాకేంద్రంలో బూసిలోసిస్ వ్యాధి నివారణ టీకాలు ఈనెల 28వరకు దూడలకు వేస్తారన్నారు. ఈ అవకాశాన్ని పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర కౌన్సిల్‌కు ఎంపిక

ధర్మవరం, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర స్థాయి కౌన్సిల్ సభ్యులుగా జిల్లా నుంచి నలుగురిని ఎంపికచేసినట్టు ఐజేయూ జాతీయ కార్యదర్శి, ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర ఎన్నికల అధికారి సోమసుందర్ బుధవారం తెలిపారు. ధర్మవరం నుంచి జీవీ నారాయణ, పుట్టపర్తి నుంచి మురళి, కదిరి నుంచి శ్రీనివాసరెడ్డి, హిందూపురం నుంచి ప్రకాశ్‌ను ఎంపిక చేశామన్నారు.

అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు అందాలి


మాట్లాడుతున్న కమిటీ చైర్మన్ లంకా దినకర్

పుట్టపర్తిరూరల్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పథకాలు అర్హులందరికీ అందేలా కార్యకర్తలు కృషి చేయాలని 20 సూత్రాల అమలు కమిటీ చైర్మన్ లంకా దినకర్ సూచించారు. బుధవారం స్థానిక బీజేపీ కార్యాలయంలో నాయకులు, కార్యకర్తలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాలపై ఆయన అవగాహన కల్పించారు. పథకాల అమలులో ఏవైనా లోపాలుంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు జీఎం శేఖర్, ఉపాధ్యక్షుడు కొండమరాజు, మండల అధ్యక్షుడు కళ్యాణ్, మీడియా కన్వీనర్ జ్యోతిప్రసాద్, నాయకులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కరించండి


ఖాళీ బిందెలతో సచివాలయం వద్ద మహిళల నిరసన

బత్తలపల్లి, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): తమ కాలనీలో తాగునీటి ఎద్దడిని నివారించాలని స్థానిక ఎస్సీ కాలనీకి చెందిన మహిళలు డిమాండ్ చేశా రు. ఈ మేరకు బుధవారం వారు స్థానిక సచివాలయం వద్ద ఖాళీ బిందెలతో ధర్నా చేపట్టారు. రెండు నెలలు తాగునీరు రాక ఇబ్బందులు పడుతున్నామని, పలుమార్లు ఫిర్యాదు చేసినా అధికారులు పట్టించుకోలేదని వాపోయారు. పంచాయతీ కార్యదర్శి నారాయణస్వామి సచివాలయ కార్యాలయంలోకి వెళ్లకుండా మహిళలు అడ్డుకున్నారు. పది రోజుల్లో నీటి సమస్య పరిష్కరిస్తామని కార్యదర్శి హామీ ఇవ్వడంతో వారు శాంతించారు.

భక్తిశ్రద్ధలతో విగ్రహాల ప్రతిష్ఠ


పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే కందికుంట

తనకల్లు, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని కోర్తికోట గ్రామంలో సీతారామలక్ష్మణ, ఆంజనేయ విగ్రహాల ప్రతిష్ఠ కార్యక్రమాన్ని మాజీ సర్పంచ్ ఎస్‌కె. మస్తాన్‌వలీ ఆధ్వర్యంలో బుధవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం హోమాలు నిర్వహించారు. ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు మస్తాన్‌వలీ అన్నసంతర్పణ చేశారు. కార్యక్రమంలో టీడీపీ కన్వీనర్ తొట్లి రెడ్డిశేఖర్‌రెడ్డి, ఈశ్వర్‌రెడ్డి, మంజునాథ్, హనుమంతురెడ్డి, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యుడు సోంపాళ్యం నాగభూషణం పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆస్పత్రి ఆవరణలో సీసీ రోడ్డు నిర్మాణం

ధర్మవరం, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వాస్పత్రిలో సీసీ రోడ్డు నిర్మాణ పనులు బుధవారం చేపట్టారు. ఆవరణంలో రూ.23 లక్షలు వైద్యవిధాన పరిషత్ నిధులతో సీసీ రోడ్డు, సీసీ కెమెరాల ఏర్పాటు, ఫర్నీచర్ తదితర మౌళిక వసతుల కల్పనకు కూటమి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. కార్యక్రమంలో ఆస్పత్రి సూపరింటెండెంట్ మాధవి, కాంట్రాక్టర్ సర్పంచ్ ముత్యాలప్పనాయుడు, సిబ్బంది పాల్గొన్నారు.


ల్యాప్‌టాప్‌ను నరసింహులుకు అందచేస్తున్న నాగరాజు

ల్యాప్‌టాప్ అప్పగింత

నల్లమాడ, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): కదిరి పట్టణానికి చెందిన నరసింహులు పుట్టపర్తిలోని డీఆర్‌డీఏ కార్యాలయంలో పనిచేస్తున్నారు. బుధవారం ఆయన కదిరి నుంచి బైక్‌లో పుట్టపర్తి వెళ్తుండగా మార్గమధ్యలో అతని ల్యాప్‌టాప్ పడిపోయింది. గమనికుండా అతను వెళ్లిపోయాడు. మండలంలోని బాస్మవారిపల్లికి చెందిన నాగరాజు రోడ్డు పక్కన ల్యాప్‌టాప్ పడి ఉండటాన్ని గుర్తించి.. దాన్ని సీఐ నరేంద్రరెడ్డికి అందజేశాడు. అది నరసింహులుకు చెందినదిగా గురించి.. ఆయన సమాచారం ఇచ్చారు. స్టేషన్‌కు వచ్చిన అతనికి దాన్ని అందజేశారు. దీంతో నాగరాజును పలువురు అభినందించారు.

మొరాయించిన సర్వర్.. రైతుల పడిగాపులు


యూనిక్ నంబర్ల కోసం వచ్చిన రైతులు

ఓబుళదేవరచెరువు, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): యూనిక్ నెంబర్ల కోసం స్థానిక రైతు సేవా కేంద్రానికి బుధవారం వచ్చిన రైతులు సర్వర్ మొరాయించడంతో పడిగాపులు కాయాల్సి వచ్చింది. ఉదయం 9గంటలకు డబురువారిపల్లి, చింతమానుపల్లి రైతులు యూనిక్ నెంబర్ల నమోదు కోసం క్యూ కట్టారు. ఉదయం నుంచి సాయంత్రం 3గంటల వరకు సర్వర్ పని చేయక పోవడంతో తిండితిప్పలు లేక పడిగాపులు కాయాల్సి వచ్చిందని మహిళ రైతులు లక్ష్మమ్మ, జయమ్మ, గంగులప్ప, లక్ష్మీదేవి, నీలమ్మ వాపోయారు. ఎట్టకేలకు సాయంత్రం సర్వర్ పనిచేయడంతో రైతులు యూనిక్ నెంబర్లను వ్యవసాయ సహాయకులు పవన్‌కుమార్‌నాయక్ నమోదు చేశారు.

తాగునీటి ఎద్దడి రానివ్వం


బోరు పనులను ప్రారంభిస్తున్న సర్పంచ్

బుక్కపట్నం, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో తాగునీటి సమస్య రానివ్వబోమని, ఆ సమస్య పరిష్కారానికే అధిక ప్రాధాన్యత ఇస్తున్నామని సర్పంచ్ నాగలక్ష్మీరాజు తెలిపారు. బుధవారం స్థానిక ఎస్సీ కాలనీలో నీటి ఎద్దడి నివారణకు పంచాయతీ నిధులతో నూతన బోరు వేయించారు. ఆ బోరులో నీరు పుష్కలంగా పడ్డాయి. ఈ కార్యక్రమంలో పంచాయతీ సిబ్బంది వెంకటేశ్వర్లు, ఆదినారాయణ, రమేష్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే నివాళి

నల్లమాడ, ఫిబ్రవరి19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మీసాలవాండ్లపల్లి గ్రామానికి చెందిన రవీంద్రారెడ్డి అనారోగ్యంతో బుధవారం మరణించాడు. ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి మీసాలవాండ్లపల్లికి వెళ్లి మృతదేహానికి పూలమాలలు వేసి, నివాళులు అర్పించారు. బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ఇందులో మండల కన్వీనర్ షైలే శివశంకర్, గడ్డం రమణారెడ్డి, కేశవరెడ్డి, వంకరకుంట సూర్యనారాయణ పాల్గొన్నారు.

ఘనంగా ఛత్రపతి శివాజీ జయంతి

ధర్మవరం, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): ఛత్రపతి శివాజీ మహరాజ్ 398వ జయంతి వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక నేసేపేటలోని అంభాభవాని ఆలయం లో స్వకుల సాలి, మరాఠి సంఘం ఆధ్వర్యంలో ఛత్రపతి శివా జీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పట్టణంలో బైకు ర్యాలీ నిర్వహించారు. అక్కడి నుంచి గొట్లూరు గ్రామానికి వెళ్లి శివాజీ విగ్రహానికి బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ హరీశ్, బీజేపీ పట్టణ, రూరల్ అధ్యక్షులు జింకా చంద్రశేఖర్, గొట్లూరు చంద్ర పూలమాలలు వేసి నివాళులర్పించారు. వృద్ధాశ్రమంలో అన్నదానం చేపట్టారు.

● కదిరి: పట్టణంతోపాటు, తలుపులలో ఛత్రపతి శివాజీ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. తలుపులలో ఛత్రపతి శివాజీ చిత్రపటానికి పలువురు పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. తలుపులలో నిర్వహించిన కార్యక్రమంలో బీజేపీ నాయకులు గోవిందు, వెంకటేశ్వర్లు, ఏపీ సీడ్స్ జిల్లా కో-కన్వీనర్ చౌడయ్య, శ్రీరాములు, గోవర్ధన్ పాల్గొన్నారు.



ధర్మవరం : శివాజీ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు, చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మరాఠీలు



మాట్లాడుతున్న ఎస్పీ రత్న

ఏఆర్ పోలీస్ దర్బార్

పుట్టపర్తిరూరల్, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): స్థానిక జిల్లా పోలీసు కార్యాలయంలోని సమావేశ భవనంలో ఏఆర్ పోలీస్ దర్బార్‌ను ఎస్పీ వీ రత్న బుధవారం నిర్వహించారు. ఎస్పీ మాట్లాడుతూ జిల్లాలో ఏఆర్ సిబ్బంది సంక్షేమానికి కట్టుబడి ఉన్నామన్నారు. సమస్యలుంటే నేరుగా తన దృష్టికి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో ఏఆర్‌డీఎస్పీ శ్రీనివాసులు, ఏఓ సుజాత, సిబ్బంది పాల్గొన్నారు.

స్తంభించిన ట్రాఫిక్

ధర్మవరం, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): స్థానిక అంజమన్ సర్కిల్‌లో బుధవారం రాత్రి దాదాపు గంట సేపు ట్రాఫిక్ స్తంభించింది. దీంతో వాహనచోదకులు ఇబ్బందులు పడ్డారు. ఇంత జరుగుతున్నా ట్రాఫిక్ పోలీసులు పట్టించుకోలేదని వాహనచోదకులు వాపోయారు. ప్రతి రోజూ ఈ సర్కిల్‌లో ఇలాగే ఉంటుందని, దీనిపై ట్రాఫిక్ పోలీసులు దృష్టిసారించాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.


అంజుమన్ సర్కిల్‌లో స్తంభించిన ట్రాఫిక్

క్రైం న్యూస్..


దగ్ధమైన దానిమ్మ తోట

దానిమ్మ తోట దగ్ధం

బత్తలపల్లి ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని సంజీవపురం కాగమయ్యస్వామి కొండ సమీపంలో ఆకతాయిలు బుధవారం నిప్పు పెట్టడంతో తన దానిమ్మ తోట పూర్తిగా దగ్ధమైనట్లు బాధిత రైతు శేషయ్య వాపోయాడు. ముస్తురు పొలంలో 10 ఎకరాల్లో 3500 దానిమ్మ చెట్లను ఏడేళ్లుగా సాగు చేస్తున్నానన్నారు. గుర్తుతెలియని ఆకతాయిలు నిప్పు పెట్టడంతో దానిమ్మ తోట అంతా పూర్తిగా దగ్ధమైందన్నారు. ఆ చెట్లతోపాటు అందులోని డ్రిప్ పైపులు, రెండు స్టాటర్లు, విద్యుత్ వైర్లు అన్ని కాలిపోయాయన్నారు. దీంతో తనకు రూ.6 లక్షలు నష్టం వాటిల్లిందని వాపోయాడు. ప్రభుత్వమే ఆదుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నాడు.

కిడ్నాప్ కథ సుఖాంతం


బాలుడిని తల్లికి అప్పగిస్తున్న పోలీసులు

తాడిమర్రి, ఫిబ్రవరి 19(ఆంధ్ర జ్యోతి): మండలంలో ని నారసింపల్లి గ్రామానికి చెందిన ఓ బాలుడి కిడ్నాప్ కథ సుఖాంతమైంది. అనంతపురం జిల్లా కల్యాణదుర్గం ప్రాంతానికి చెందిన రామాంజి అనే వ్యక్తి .. నారసింపల్లి గ్రామానికి చెం దిన ఓ మహిళతో విభేదాలు ఉన్నాయి. ఆమెను బెదిరించేందుకు ఆ మహిళ కుమారుడిని మంగళవారం సాయంత్రం కిడ్నాప్ చేసి తీసుకెళ్లాడు. దీనిపై సమాచారం అందుకున్న తాడిమర్రి ఎస్ఐ క్రిష్ణవేణి ఎస్పీ రత్నకు, ధర్మవరం డీఎస్పీ హేమంత్‌కుమార్‌కు సమాచారం అందించారు. అప్రమత్తమైన వారు రెండు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి బాలుడి గాలింపు చర్యలు చేపట్టారు. రామాంజి సెల్‌ఫోన్ ఆధారంగా లోకేషన్ గుర్తించి రాత్రి 10.30 గంటలకు ఆ నిందితుడ్ని అదుపులోకి తీసుకున్నారు. బాలుడిని క్షేమంగా అదే రోజు రాత్రి తల్లికి అప్పగించారు.

అధికారులకు నెమలి అప్పగింత


నెమలిని పోలీసులకు అప్పగిస్తున్న రైతులు

కొత్తచెరువు, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి సమీపంలోని తన మామిడితోటలో ఓ నెమలి స్పృహతప్పి పడిపోయి ఉండటాన్ని రైతు రవిశంకర్ బుధవారం గమనించాడు. దీన్ని స్థానిక పోలీసులకు అప్పగించగా.. వారు ఫారెస్టు సిబ్బందికి అప్పగించారు. నెమలి తలకు గాయం కావడం వల్ల ఎగరలేకపోతోందని, దీనిని కరుణా వన్యప్రాణ సంరక్షణ కేంద్రంలో ఉంచి చికిత్స చేయించి.. కోలుకున్న తర్వాత అడివిలో విదిలేస్తామని వారు తెలిపారు.

వ్యక్తిపై దాడి.. ఇద్దరిపై కేసు

ధర్మవరం, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని దుర్గానగర్‌కు చెందిన పామిడి పవన్‌కుమార్‌పై అదే ప్రాంతానికి చెందిన ఇర్ఫాన్, రోషన్ దాడి చేయడంతో వారిపై కేసులు కేసు నమోదు చేశారు. మంగళవారం రాత్రి పవన్‌కుమార్ వెళ్తున్న బైక్, ఇర్ఫాన్, రోషన్ వెళ్తున్న బైక్ ఢీకొన్నాయి. దీంతో వారు గొడవపడ్డారు. బుధవారం ఇర్ఫాన్, రోషన్ మరికొందరితో కలిసి పవన్‌కుమార్‌పై దాడిచేశారు. గాయపడ్డ పవన్‌కుమార్‌ను స్థానిక ప్రభుత్వాస్పత్రికి స్థానికులు తరలించారు. అతని ఫిర్యాదు మేరకు ఇర్ఫాన్, రోషన్‌పై కేసు నమోదు చేసినట్టు టూటౌన్ పోలీసులు తెలిపారు.

బైక్ చోరీ

గాండ్లపెంట, ఫిబ్రవరి 19(అంధ్రజ్యోతి): స్థానిక జేకే మెడికల్ స్టోర్ వద్ద మంగళవారం రాత్రి స్థానికుడు షేక్ అబూబకర్ ఉం చిన బైక్ చోరీకి గురైంది. ముగ్గురు వ్యక్తులు ఆ బైక్‌ను చోరీ చేసినట్లు అక్కడున్న సీసీ కెమెరాలో రికార్డ్ అయింది. దీనిపై బాధితుడు బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సీసీపుటేజీ ఆధారంగా విచారణ చేపట్టామని ఇన్‌ఛార్జీ ఎస్ఐ మగ్బుల్ బాషా తెలిపారు.

న్యూస్ బాక్స్

బీసీ కార్పొరేషన్ రుణ దరఖాస్తుల పరిశీలన

పరిగి, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): బీసీ కార్పొరేషన్ రుణాల కోసం వచ్చిన దరఖాస్తులను బుధవారం ఎంపీడీఓ శ్రీధర్ ఆధ్వర్యంలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీసీ, ఈబీసీ, కమ్మ, రెడ్డి, క్షత్రియ, వైశ్య, బ్రాహ్మణ, మేదర, కుమ్మరి, బలిజ వర్గాలకు చెందిన 298 మంది నిరుద్యోగ యువతీయువకులు స్వయం ఉపాధి కోసం దరఖాస్తు చేసుకోగా 252 మంది హాజరయ్యారన్నారు.

గుడిబండ:మండల పరిషత్ కార్యాలయంలో బీసీ కార్పొరేషన్ రుణాల కోసం లబ్ధిదారుల ఎంపికకు ఇంటర్వ్యూలు నిర్వహించినట్లు ఎంపీడీఓ గంగాధర్ తెలిపారు.

లేపాక్షి:బీసీ, ఈబీసీ, కాపులకు సబ్సిడీరుణాలకు సంబంధించి ఎంపీడీఓకార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహించారు.

సోమందేపల్లి:బీసీ కార్పొరేషన్ రుణాలకు దరఖాస్తు చేసుకున్న లబ్దిదారులకు బుధవారం ఎంపీడీఓ కార్యాలయంలో బ్యాంక్ అధికారులు ఇంటర్వ్యూలు నిర్వహించారు.

కురుబవాండ్లపల్లిలో గంగపూజ



కురుబవాండ్లపల్లిలో గంగపూజ చేస్తున్న దృశ్యం

పెనుకొండ రూరల్, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): కురుబవాండ్లపల్లిలో కృష్ణాజలాలకు బుధవారం గంగపూజ చేశారు. గొల్లపల్లి రిజర్వాయర్ నుంచి మడకశిర బ్రాంచ్ కెనాల్ ద్వారా ముత్యాల చెరువుకు నీరు విడుదల చేయడంతో చెరువునిండి మరువపారి నీరు కురుబవాండ్లపల్లి చెరువుకు చేరింది. దీంతో మాజీ సర్పంచ్ సోమశేఖర్ సమక్షంలో రైతులు, గ్రామస్థులు చెరువు వద్ద గంగపూజ చేశారు. అయితే పెనుకొండ సమీపంలోని 44వ జాతీయరహదారి పక్కన నాసెన్‌కు వెళ్లే పైప్‌లైన్ మరమ్మతుల కారణంగా నీటి సరఫరాను తాత్కాలికంగా ఆపివేశారు. మరమ్మతుల అనంతరం చెరువుకు తిరిగి నీటిని విడుదల చేస్తామని హెచ్ఎన్ఎస్ఎస్ అధికారులు తెలిపారు.

విశిష్ట గుర్తింపు సంఖ్య కోసం నమోదు చేసుకోవాలి

పెనుకొండ రూరల్, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన 11అంకెల విశిష్ట గుర్తింపు సంఖ్య కోసం రైతులు నమోదు చేసుకోవాలని ఏఓ చందన పేర్కొన్నారు. బుధవారం మండలంలో యర్రమంచి, ఇస్లాపురం గ్రామంలో పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. దీని వల్ల ప్రభుత్వ పథకాలైన అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్, పంట పరిహారం, పంటల బీమా రైతులకు వర్తిస్తాయన్నారు. ఆర్బీకే కేంద్రాల్లో ప్రతిరైతు విశిష్ట గుర్తింపు సంఖ్య కోసం నమోదు చేయించుకోవాలన్నారు.

ఆరోగ్యకేంద్రం తనిఖీ

అగళి, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని డిప్యూటీ డీఎంహెచ్ఓ మంజువాణి బుధవారం ఆకస్మిక తనిఖీ చేశారు. అనంతరం సిబ్బందితోనూ, ఆశా కార్యకర్తలతోనూ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. సిబ్బంది అంకిత భావంతో పనిచేయాలని సూచించారు. మండల వ్యాప్తంగా గర్భిణీ స్త్రీల, డెలివరి కేసుల రికార్డులను, జాతీయ ప్రోగ్రాం రికార్డులను పరిశీలించారు. ప్రతి శుక్రవారం డ్రై డే పాటించాలన్నారు. ఆమె వెంట డా.శివానంద గాయత్రి, సూపర్‌వైజర్‌నర్సారెడ్డి, గంగిరెడ్డి, భూషణ్‌నాయక్, ఏఎన్ఎంలు ఉన్నారు.

బడిలో హిందీ పండుగ



పోస్టర్లను విడుదల చేస్తున్న ఎంఈఓ చంద్రశేఖర్‌నాయుడు

అగళి, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): స్థానిక జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలోని ఆర్డీటి భవనంలో బుధవారం హిందీ పండుగ ఘనంగా జరుపుకున్నారు. కార్యక్రమానికి ఎంఈఓ 2 చంద్రశేఖర్ నాయుడు హాజరై మాట్లాడుతూ హిందీ భాష విద్యార్థులలో ఆసక్తి, విజ్ఞానం పెంచుకొనుటకు దోహదపడుతుందన్నారు. హిందీ భాష ప్రాధాన్యతను వివరించారు. అదే విధంగా మోడల్ పాఠశాలలో ప్రిన్సిపాల్ జాఫర్ ఆధ్వర్యంలో, కేజీబీవీ పాఠశాల, గుప్త కళాశాల, పాఠశాలల్లో కూడా హిందీ పండుగను జరుపుకున్నారు.

ఘనంగా వీడ్కోలు దినోత్సవం



ఆకట్టుకున్న విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు

పెనుకొండ, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): స్థానిక సత్యసాయి జూనియర్ కళాశాలలో వీడ్కోలు దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముందుగా విద్యార్థులు గణపతి, సరస్వతి పూజలు నిర్వహించారు. అనంతరం ఏర్పాటుచేసిన సమావేశానికి కళాశాల ప్రిన్సిపాల్ గంగాధర్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థి చిన్నప్పటి నుంచి కష్టపడి చదివే గుణం అలవర్చుకోవాలన్నారు. ఓ ప్రణాళిక ప్రకారం ముందుకెళ్తే ఉజ్వల భవిష్యత్తుకు చేరుకోగలమన్నారు. అనంతరం సీనియర్ విద్యార్థులు తమకు చదువుచెప్పిన గురువులను ఘనంగా సత్కరించారు. విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో డిగ్రీకళాశాల ప్రిన్సిపాల్ ఆదిశేషరెడ్డి, ఏఓ కేశవయ్య పాల్గొన్నారు.

సీపీఎం మండల కార్యదర్శిగా రంగప్ప ఎంపిక

సోమందేపల్లి, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని సీపీఎం కార్యాలయంలో రంగప్పను మండల కార్యదర్శిగా బుధవారం ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా రంగప్ప మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌వల్ల రాష్ట్రంతోపాటు జిల్లాకు తీరని అన్యాయం జరిగిందన్నారు. దీనిపై గురువారం జిల్లా కమిటీ పిలుపుమేరకు నిరసన కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు తెలిపారు. ప్రజలు పెద్దఎత్తున పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. మండల కార్యదర్శిగా తనను ఎంపిక చేసినందుకు రాష్ట్ర, జిల్లా నాయకులను ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

నేడు నరేంద్రసింగ్ బేడీ సంస్మరణ సభ

పెనుకొండ, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): యంగ్ ఇండియా ప్రాజెక్ట్ వ్యవస్థాపకుడు, ఉపాధి హామీ చట్టం రూపకర్త నరేంద్ర సింగ్ బేడీ సంస్మరణ సభ గురువారం స్థానిక ముస్లిం మైనార్టీ షాదీ మహల్‌లో ఉదయం 10 గంటలకు నిర్వహించనున్నట్లు సీనియర్ నాయకులు తెలిపారు.

కృష్ణానీటి కోసం నిరీక్షణ

- ఇప్పటికే కాలువలో 60 కి.మీ. ప్రవహించిన జలం
- గొల్లపల్లి రిజర్వాయర్‌లో 1.4 టీఎంసీల నిల్వ
- మరో పది రోజుల్లో మడకశిరకు రానున్న కృష్ణమ్మ



హంద్రీనీవా కాలువ

మడకశిర, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): మన ఇంటికి ఇష్టమైన బంధువులు వస్తున్నారని తెలిస్తే వారి కోసం ఎంతగానో ఎదురుచూస్తాం. అలాగే కృష్ణాజలాల కోసం మడకశిర ప్రాంత రైతులు కూడా కళ్లు కాయలు కాచేలా నిరీక్షిస్తున్నారు.క్షక రైతన్నల కల త్వరలోనే నెరవేరబోతోంది. ఐదు సంవత్సరాల క్రితం తెలుగు దేశం పార్టీ అధికారంలో ఉన్నప్పుడు కృష్ణానది జలాలతో మడకశిర ప్రాంతంలో నాలుగు చెరువులను నింపారు. ఆ తర్వాత వైసీపీప్రభుత్వంలో చెరువులను అసలు పట్టించుకోలేదు. మరలా కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత గొల్లపల్లి రిజర్వాయర్ నుంచి కృష్ణా జలాలను మడకశిర బ్రాంచ్ కెనాల్‌కు ఇటీవల విడుదల చేశారు. దీంతో మరో పది రోజులలో మడకశిర ప్రాంతానికి కృష్ణానది జలాలు తరలిరానున్నాయి. ఆ శుభఘడియ కోసం రైతులు ఎదురుచూస్తున్నారు.

ఎటువంటి సాగు నీటి వనరులు లేని ఈ ప్రాంత రైతులు బోర్ల కింద అరకొర పంటలు సాగుచేస్తూ జీవనం సాగిస్తున్నారు. గత సంవత్సరం కురిసిన ఓ మోస్తారు వర్షాలకు చెరువులకు చేరిన నీళ్లు కూడా వేసవి ప్రారంభంలోనే అడుగంటి పోయాయి. వేసవి వచ్చిందంటే భూగర్భజలాలు అడుగంటి పోయి తాగునీటికి సైతం ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడతారు. ఈ ప్రాంతంలో వెయ్యి అడుగులు తవ్వించినా నీళ్లు పడవు. పంటలను కాపాడుకునేందుకు ట్యాంకర్లతో నీటిని అందించినా ఫలితం ఉండదు. ప్రస్తుతం కృష్ణాజలాలతో చెరువులను నింపితే భూగర్భజలాలు పెరిగి బోరులో నీటిమట్టం తగ్గకుండా ఉంటుందని, దీంతో తాగు, సాగు నీటి సమస్య తలెత్తకుండా ఉంటుందని రైతులంటున్నారు.

ఈ క్రమంలో గొల్లపల్లి రిజర్వాయర్ నుంచి మడకశిర బ్రాంచ్ కెనాల్‌కు నీరు విడుదల చేశారు. ఆ నీరు పెనుకొండ ప్రాంతంలోని చెరువులకు క్రమంగా చేరుతోంది. ఇప్పటికే ఆప్రాంతంలో 7 చెరువులు నిండినట్లు అధికారులు తెలిపారు. మరో రెండురోజుల్లో నీరు హిందూపురం చేరుతుందంటున్నారు. అనంతరం మడకశిర ప్రాంతంలోని చెరువులకు నీరు చేరుతుందని సంబంధిత అధికారుల సమాచారం. గొల్లపల్లి రిజర్వాయర్‌లో ప్రస్తుతం 1.4టింసిల నీరు నిలువ ఉంది. అక్కడ నుంచి మడకశిర వరకు 120 కిలోమీటర్ల మేర హంద్రీనీవా కాలువ ఉంది. ప్రస్తుతం 60 కిలోమీటర్ల వరకూ నీరు చేరింది. గురువారం నాటికి హిందూరు ప్రాంతానికి నీళ్లు చేరతాయి. మరో 60 కిలోటర్ల మేర కాలువలో నీరు పారితే నీళ్లు మడకశిర చెరువుకు చేరతాయి. ఈ లోపుగా కాలువలో కంపలు తొలగించాల్సి ఉంది. మడకశిర నియోజకవర్గంలో 120 చెరువులు ఉన్నాయి. ఈ చెరువులన్నీ నీటితో కళకళలాడే రోజు కోసం రైతులు ఎదురుచూస్తున్నారు. వేసవిలో కృష్ణమ్మ పరవళ్లు తొక్కుతుందన్న సమాచారం తెలియడంతో రైతన్నలు సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారు.

కృష్ణా జలాలతో చెరువులన్నీ నింపాలి



ప్రస్తుతం చెరువులలో నీరు అడుగంటి పోతోంది. చెరువులలో నీరు లేకపోతే భూగర్భజలాలు అడుగంటి పోయి బోర్లు ఎండిపోయే ప్రమాదం ఉంది. ఇక్కడ 800 అడుగుల లోతు బోరు తవ్వించినా నీరు దొరకడం కష్టమే. కృష్ణా జలాలతో చెరువులను నింపి నీటి సమస్య పరిష్కరించాలి.

మల్లికార్జున, ఆయకట్టు అధ్యక్షుడు

త్వరలో అన్నిచెరువులకు నీరిస్తాం

గొల్లపల్లి రిజర్వాయర్ లో 1.4టీఎంసీల నీరు నిల్వ ఉంది. ఈ నెల 12న గొల్లపల్లి రిజర్వాయర్ నుంచి మడకశిర బ్రాంచి కెనాల్‌కు నీటిని విడుదల చేశాం. మరో రెండు రోజులలో హిందూపురం చెరువులకు నీరు చేరుతాయి. అనంతరం మరో వారంలో మడకశిర ప్రాంతంలోని చెరువులకు కృష్ణానది జలాలు చేరుతాయి. అన్ని చెరువులకు నీరందిస్తాం.

మురళీధర్, ఈఈ, హెచ్ఎన్ఎస్ఎస్

అసాంఘిక శక్తులకు అడ్డాగా పాఠశాల

- కొత్త భవనాల కారణంగా పాత స్కూలు ఆవరణ దుర్వినియోగం



అసాంఘిక శక్తులకు అడ్డాగా మారిన పాఠశాల భవనం

సోమందేపల్లి, ఫిబ్రవరి19(ఆంధ్రజ్యోతి):సోమందేపల్లి పాత హైస్కూల్ అసాంఘిక శక్తులకు అడ్డాగా మారింది. పట్టణ నడిబొడ్డున ఎన్టీఆర్ సర్కిల్‌కు సమీపంలో ఉన్నందున రాత్రివేళల్లో మందుబాబులు మద్యం సేవించ డానికి ఈ పాఠశాల భవనాలను వినియోగిస్తున్నారు. అదేవిధంగా అనైతిక కార్యకలాపాలకు సైతం పాఠశాల కేంద్రంగా మారింది. ప్రహరీ కూలిపోవడంతోపాటు ప్రధాన గేటు లేకపోవడంతో అసాంఘిక కార్యకలాపాలు యథేచ్ఛగా సాగుతున్నట్లు స్థానికులు పేర్కొంటున్నారు. ఆవరణలో నాలుగు కొత్తగదులు ఆరు పాత గదులున్నాయి. మూడు తరగతి గదులను వెలుగు కార్యాలయం సిబ్బందికి సమావేశం నిర్వహించుకోవడానికి ఇచ్చారు. మిగిలిన వాటికి కిటికీలు, తలుపులు లేకపోవడంతో అసాంఘిక శక్తులు చెలరేగిపోతున్నారు. పట్టపగలే మందుబాబులు, ఆకతాయిలు, జూదరులు, ఆన్‌లైన్ గేమ్స్ ఆడే యువకులకు ఇది విడిదిగా మారింది. అదేవిధంగా పాఠశాల స్థలాన్ని చుట్టుపక్కల గృహాల యజమానులు కొద్ది కొద్దిగా కబ్జా చేస్తూ నిర్మాణాలు చేపడుతున్నా పట్టించుకునే నాథుడు లేడు. మూడేళ్ల క్రితం వరకు ఇక్కడ తరగతులు నిర్వహించారు. అయితే ఆర్టీసీ బస్టాండువద్ద కొత్త భవనాలు వినియోగంలోకి రావడంతో హైస్కూల్ తరగతులను అందులోకి మార్చి దీనిని గాలికి వదిలేశారు. ఆవరణ అంతా మందుసీసాలు, చెత్తాచెదారం, ప్లాస్టిక్‌డిస్పోజల్‌తో నిండి కంపుకొడుతోంది. అదేవిధంగా గృహాల యజమానులు, బాత్రూమ్ నీటిని పాఠశాల ఆవరణలోకి వదిలిపెడుతున్నారు. ఇంత జరుగుతున్నా విద్యాశాఖ అధికారులు చూసి చూడనట్లు వ్యవహరిస్తుండటం పలు విమర్శలకు తావిస్తోంది.

దీనిపై హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు నాగేంద్రను వివరణ కోరగా కొత్త హైస్కూల్ నిర్మాణం పూర్తికావడంతో తరగతులను అక్కడికి మార్చామన్నారు. దీంతో కొందరు ఇక్కడఅనైతిక కార్యకలాపాలకు పాల్పడుతన్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. ఎంఈఓ-2 ఆనంద్‌బాబును అడగ్గా వృథాగా ఉన్న పాఠశాల భవనాలను వచ్చేయేడాది మంజూరయ్యే ఇంటర్ సెక్షన్ కోసం పెట్టుకున్నామన్నారు. త్వరలో పాఠశాల భవనాలను వినియోగంలోకి తీసుకొస్తామన్నారు.

సామాన్యుల సమస్యల పరిష్కారమే లక్ష్యం

- ఎమ్మెల్యే ఎంఎస్ రాజు



సామాన్యుల సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే ఎంఎస్ రాజు

మడకశిరటౌన్, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): కాలనీల్లో పర్యటించడం వల్ల సామాన్యుల సమస్యలు తెలుసుకొని పరిష్కరించడానికి వీలుగా ఉంటుందని ఎమ్మెల్యే ఎంఎస్‌రాజు అన్నారు. పట్టణంలో బుధవారం టీటైమ్ విత్ ఎమ్మెల్యే పేరిట ఆయన పట్టణంలోని పలు కాలనీల్లో పర్యటించారు. టీ తాగుతూ సామాన్యులతో మమేకమయ్యారు. నేరుగా ప్రజలు స్వయంగా ఎమ్మెల్యే వద్దకు వచ్చి అనేక సమస్యలను విన్నవించుకున్నారు. హమాలీలు, సామాన్య వ్యాపారులు, కాలనీల్లో ప్రభుత్వం నుండి అందుతున్న సౌకర్యాలు, పింఛన్లు, ఇతరత్రా వివరాలను అడిగి తెలుసుకొన్నారు. పలువురు అందించిన వినతులను స్వీకరించి అప్పటికప్పుడే సమస్యల పరిష్కారానికి అధికారులకు సూచనలు చేశారు. అనంతరం వడిసిలమ్మ దేవస్థానం ఆవరణలో పట్టణ సమస్యలపై చర్చించారు.

నియోజకవర్గ అభివృద్ధి కోసమే పార్టీలోకి వలసలు

మడకశిర నియోజకవర్గంలో పలువురు జడ్పీటీసీలు, ఎంపీపీలు వైసీపీని వీడి తెలుగుదేశం పార్టీలోకి చేరుతున్నట్లు ఎమ్మెల్యే ఎం.ఎస్.రాజు అన్నారు. బుధవారం ఆర్అండ్‌బీ అతిథిగృహం ఆవరణలో అమరాపురం జడ్పీటీసీ సభ్యులు స్వారక్క నరసింహమూర్తి, మరో 30 కుటుంబాల వారు వైసీపీని వీడి తెలుగుదేశం పార్టీ తీర్థం పుచ్చుకొన్నారు. టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు గుండుమల తిప్పేస్వామి, ఎమ్మెల్యే ఆధ్వర్యంలో తెలుగుదేశం పార్టీలోకి చేరారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత ఐదేళ్ల వైసీపీ పాలనలో నియోజకవర్గం ఏమాత్రం అభివృద్ధికి నోచుకోలేదని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక చంద్రబాబు నాయకత్వంలో జరుగుతున్న అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను చూసి అనేక మంది స్వచ్ఛందంగా టీడీపీ పార్టీలోకి చేరుతున్నట్లు తెలిపారు. అనంతరం జడ్పీటీసీ సభ్యులు స్వారక్క నరసింహమూర్తి మాట్లాడుతూ వైసీపీ పార్టీకి నియోజకవర్గంలో నాయకత్వం లేదని, తల్లీ తండ్రి లేని పార్టీ వైసీపీ పార్టీ అని, తెలుగుదేశం ప్రభుత్వంలోనే నియోజకవర్గం అభివృద్ధి సాధ్యపడుతుందని, తాను పూర్తిగా విశ్వసిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ శ్రీనివాసమూర్తి, నియోజకవర్గం ఎస్సీసెల్ అధ్యక్షులు జయకుమార్, మండల కన్వీనర్ గణేష్, మాజీ ఎంపీపీ రామిరెడ్డి, కృష్ణమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీలో కార్మికుల సంఖ్యను పెంచండి



ఆర్డీఓకు వినతిపత్రం అందిస్తున్న నగర పంచాయతీ కార్మికులు

పెనుకొండ, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): నగర పంచాయతీ కార్యాలయంలో పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా కార్మికుల సంఖ్యను పెంచాలని కోరుతూ ఏపీ మునిసిపల్ వర్కర్స్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా కార్యదర్శి లక్ష్మీనారాయణ, కలెక్టర్ ఆనంద్‌కుమార్‌కు వినతిపత్రం అందించారు. బుధవారం లక్ష్మీనారాయణతోపాటు మునిసిపల్ కార్మికులు, సీఐటీయూ నాయకులు వినతిని అందిస్తూ మేజర్ పంచాయతీ నుంచి నగర పంచాయతీ స్థాయికి పెరిగిన పెనుకొండలో జనాభాకు అనుగుణంగా కార్మికుల సంఖ్య, ఇంజనీర్ల సంఖ్య పెరగలేదన్నారు. దాని కారణంగా తక్కువ సంఖ్యలో ఉన్న కార్మికులపై పనిభారం ఎక్కువైందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం స్పందించి కార్మికుల సంఖ్య పెంచేవిధంగా చర్యలు తీసుకోవాలని యూనియన్ నాయకులు డిమాండ్ చేశారు.

ఉపాధి కూలీలకు బకాయిలు చెల్లించండి

సోమందేపల్లి, ఫిబ్రవరి19(ఆంధ్రజ్యోతి):ఉపాధిహామీ పథకంలో భాగంగా మండలంలోని రంగేపల్లి గ్రామానికి చెందిన ఉపాధికూలీలకు గత తొమ్మిది వారాల నుంచి బకాయిపడ్డ బిల్లులను అధికారులు చెల్లించలేదని సీపీఎం జిల్లా కార్యదర్శి పెద్దన్న తెలిపారు. పని ప్రదేశాన్ని పరిశీలించిన ఆయన కూలీలతో మాట్లాడారు. అనంతరం మాట్లాడుతూ పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలన్నారు.

ద్విచక్రవాహనానికి నిప్పు

చిలమత్తూరు, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కోడూరు తోపు వద్ద ఉన్న ప్రైవేటు లేవుట్‌లో గుర్తుతెలియని వ్యక్తులు ఓ ద్విచక్రవాహనానికి నిప్పుపెట్టారు. మంగళవారం మధ్యాహ్న సమయంలో ద్విచక్రవాహనాన్ని గుర్తు తెలియని వ్యక్తులు లేఅవుట్‌లోకి తీసుకెళ్లి దానికి నిప్పు పెట్టి అక్కడ నుంచి వెళ్లిపోయినట్లు స్థానికులు తెలిపారు. అయితే ఆ వాహనం ఎవరిది? ఎవరు నిప్పు పెట్టారు? ఎందుకు పెట్టారు అనే విషయం తెలియరాలేదు. వాహనానికి నిప్పు పెట్టిన విషయం పోలీసులకు సమాచారం అందించడంతో వారు సంఘటనా స్థలానికి వెళ్లి ఆరా తీశారు. దీనిపై విచారణ చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

పాఠశాలలో వంట గది నిర్మాణం ప్రారంభం

సోమందేపల్లి, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం కియా అనుబంధ సంస్థ యాజమాన్యం ప్రతినిధులు షెడ్డు, వంటగది నిర్మాణ పనులు ప్రారంభించారు. హెచ్ఎం నాగేంద్రప్రసాద్ మాట్లాడుతూ ఇటీవల స్లాప్ కంపెనీ ప్రతినిధి మెన్సీయహిమ్ తన బృందంతో కలిసి పాఠశాలను సందర్శించారన్నారు. ఈ నేపథ్యంలో షెడ్డు, వంటగది నిర్మాణం చేస్తామని హామీ ఇచ్చారన్నారు. ఈ నేపథ్యంలో ఇచ్చిన మాట మేరకు 50అడుగులు షెడ్డు, వంటగది నిర్మాణ పనులు ప్రారంభించినట్లు తెలిపారు.

ఇంట్లో ఆభరణాల చోరీ

అగళి, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి) : అగళి మండలం ఎంఎం పాళ్యం గ్రామానికి చెందిన ప్రేమలత భర్త ఓబులప్పలు కర్నాటక రాష్ట్రం మధుగిరి తాలూకా దొడ్డేరిలో జాతర మహోత్సవానికి వెళ్లి బుధవారం ఇంటికి వచ్చి చూడగా గుర్తుతెలియని దుండగులు దొంగతనానికి పాల్పడ్డారు. ఇంటి తలుపులు పగలకొట్టి బీరువాలో పెట్టిన 50గ్రాములు బంగారు నెక్లెస్ 250గ్రాముల వెండి ఆభరణాలను దొంగలించినట్లు బాధితురాలు ప్రేమలత వాపోయింది.

నిబంధనలకు విరుద్ధంగా తరగతుల నిర్వహణ

హిందూపురం అర్బన్, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ నిబంధనలను పక్కనపెట్టి ఇష్టారాజ్యంగా తరగతులు నిర్వహిస్తున్నారని విద్యార్థి సంఘం నాయకులు పురం ఎంఈఓ గంగప్పకు ఫిర్యాదు చేశారు. పట్టణ పరిధిలోని భాష్యం పాఠశాలలో ఎల్‌కేజీ, యూకేజీ, తరగతులు నిర్వహించడానికి ప్రభుత్వం నుంచి అనుమతులు లేకపోయినా తరగతులను నిర్వహిస్తున్నారని విద్యార్థి సంఘం నాయకులు ఆయనకు ఫిర్యాదు చేశారు. దీంతో బుధవారం ఎంఈఓ పాఠశాలను తనిఖీచేసి నిబంధనలకు విరుద్ధంగా నడుచుకుంటే చర్యలు తప్పవని హెచ్చరించి ప్రిన్సిపాల్‌కు నోటీసులు అందించారు. వెంటనే విద్యార్థుల తల్లిదండ్రులకు సమాచారాన్ని అందించి పిల్లలను ఇళ్లకు తీసుకెళ్లే విధంగా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. నిబంధనలకు విరుద్ధంగా ఎవరైనా ప్రవర్తిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు బాబావలి, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

నిరాహార దీక్ష చేస్తున్న వ్యక్తికి అస్వస్థత

- ఆసుపత్రికి తరలింపు



చికిత్స పొందుతున్న శ్రీనివాస్‌బాబు

పావగడ, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): గత నాలుగు రోజుల నుంచి 371 యాక్ట్ అమలు చేయాలని కోరుతూ అంబేద్కర్ సర్కిల్ ముందు నిరాహారదీక్ష చేపట్టిన సమాజసేవకుడు శ్రీనివాస్‌బాబు బుధవారం అస్వస్థతకు గురయ్యాడు. ఈ యాక్ట్ ప్రకారం పావగడకు ప్రత్యేక హోదా, మౌలిక సదుపాయాలు కల్పించాలని, నిరుద్యోగ సమస్యను పరిష్కరించాలని అధికారులను కోరినా వారు నిర్లక్ష్య ధోరణి అవలంబిస్తున్నారని శ్రీనివాస్‌బాబు తెలిపారు. ఈనేపథ్యంలో నాలుగు రోజుల నుంచి కేవలం నీరు మాత్రమే సేవించి ఆమరణ నిరాహారదీక్ష చేపట్టడంతో ఆయన అస్వస్థతకు గురయ్యాడు. దీంతో బుధవారం మధ్యాహ్నం ఆయనకు వైద్యపరీక్షలు చేయించి ఆసుపత్రికి తరలించారు. ఆయన ఆరోగ్యం నిలకడగా ఉన్నట్లు వైద్యులు తెలుపడంతో అధికారులు ఊపిరి పీల్చుకున్నారు.

పంచాయతీ ఆదాయ వనరుల వేలంపాట

అమరాపురం, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని హేమావతి గ్రామ పంచాయతీలో సర్పంచి తిప్పేస్వామి అధ్యక్షతన వాహనాల పార్కింగ్ ఫీజు వసూలు చేయడానికి నిర్వహించిన వేలంపాట జూజీ రూ.76వేలతో తిప్పజ్జ దక్కించుకున్నారు. చింతపలసాయాన్ని రూ.27వేలకు రంగప్ప అనే వ్యక్తి దక్కించుకున్నారు. ఈకార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి నరేష్‌బాబు, గ్రామ పెద్దలు, ముఖ్య నాయకులు, ఎస్సీ సెల్ నియోజకవర్గం అధ్యక్షులు జయకుమార్, గొల్లమారనపల్లి రామచంద్రప్ప తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన కొల్లాపురి మహాలక్ష్మీదేవి ఉత్సవాలు

అగళి, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని నర్సాంబుది గ్రామంలో గత మూడు రోజులుగా జరిగిన రత్నగిరి కొల్లాపురి మహాలక్ష్మీ దేవి ఉత్సవాలు బుధవారంతో ముగిశాయి. కొల్లాపురి మహాలక్ష్మీదేవిని నరసింహండి గ్రామానికి తీసుకువచ్చి భక్తిశ్రద్ధలతో గ్రామ ప్రజలు మొక్కు బడులు తీర్చుకుని అమ్మవారికి ఊరేగింపు చేసి పూజా కార్యక్రమాలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో వేలాదిమంది భక్తులు పాల్గొన్నారు. బుధ వారం రొళ్ల మండలం రత్నగిరి దేవస్థానానికి తిరిగి అమ్మవారిని చేర్చారు.

రెవెన్యూ అధికారుల వద్ద బైండోవర్



రెవెన్యూ అధికారుల వద్ద బైండోవర్ చేస్తున్న పోలీసు సిబ్బంది

గుడిబండ, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని పూజారిపల్లి గ్రామానికి చెందిన భూ తగాదాల విషయంలో గొడవ పడిన రెండు కుటుంబాలను రెవెన్యూ అధికారుల వద్ద బుధవారం బైండోవర్ చేసినట్లు ఎస్ఐ రాజకుళ్లాయప్ప తెలిపారు. పూజారిపల్లి గ్రామానికి చెందిన ఓబుశేసు, ఈరన్న, దాసి తదితరులపై కేసు నమోదు చేసి రెవిన్యూ అధికారుల వద్ద బైండోవర్ చేసినట్లు ఆయన తెలిపారు.

గొర్రెల చోరీపై కేసు నమోదు

గోరంట్ల, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి) : మండలంలోని బూదిలి గ్రామానికి చెందిన గౌస్‌సాబ్‌కు చెందిన పది గొర్రెలు చోరీకి గురికావడంపై పోలీస్ స్టేషన్‌లో బుధవారం కేసు నమోదు చేసినట్లు సీఐ శేఖర్ తెలిపారు. గౌస్‌సాబ్ ఇంటి వద్ద గొర్రెల మందలో నుంచి పది గొర్రెలను గత యేడాది నవంబరు 30న గుర్తుతెలియని వ్యక్తులు దొంగిలించారు. ఇందుకు సంబంధించి అదే గ్రామానికి చెందిన వడ్డె బాలుపై బాధితుడు స్పందన కార్యక్రమంలో జిల్లా పోలీస్ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈఫిర్యాదు మేరకు రూ.1.60లక్షల విలువ చేసే గొర్రెల అపహరణపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

మామిడితోటకు నిప్పు



పులమతి గ్రామంలో కాలిపోయిన మామిడిచెట్లు

లేపాక్షి, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పులమతి గ్రామంలో మహిళ రైతు సాకమ్మకు చెందిన మూడెకరాల పొలంలో మామిడిచెట్లకు గుర్తుతెలియని వ్యక్తులు మంగళవారం రాత్రి నిప్పంటించారు. దీంతో డ్రిప్, స్ప్రింక్లర్లు, మామిడిచెట్లు పూర్తిగా దహనమయ్యాయి. దాదాపు రూ.3లక్షలు నష్టం వాటిల్లినట్లు గ్రామస్థులు తెలిపారు. ప్రభుత్వం స్పందించి మహిళా రైతును ఆదుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

రామన్నపల్లిలో ఉలవకట్టె వామి దగ్ధం



కాలిపోతున్న ఉలవకట్టె

గోరంట్ల, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని రామన్నపల్లిలో రైతు వడ్డె నారాయణప్ప నూర్పిడికి సిద్ధంగా ఉంచిన ఉలవకాయల వామి బుధవారం జరిగిన ప్రమాదంలో పూర్తిగా కాలిపోయింది. నారాయణప్ప తనకు సొంత పొలం లేకపోయినా, లీజుకు తీసుకుని 9 ఎకరాల్లో ఉలవ పంట సాగుచేశారు. పాడి పశువులతోపాటు, గొర్రెలు మేతగా ఉలవ పొట్టు ఉంటుందన్న ఉద్దేశంలో పంటను సాగుచేశారు. పంట సాగుకు, కోతకు రూ.లక్షల కూలీల ఖర్చు అయింది. కాయలతో ఉన్న ఉలవకట్టెను నాలుగు ట్రాక్టర్లు నిలువ ఉంచుకున్నాడు. బుధవారం మధ్యాహ్నం గుర్తు తెలియని వ్యక్తులు నిప్పుపెట్టడంతో వామి కాలి బూడిదయింది. గ్రామస్తులు నీటి ట్యాంకర్ల ద్వారా ఆర్పడానికి ప్రయత్నించినా ఫలితం లేకుండాపోయింది. పక్కనే ఉన్న శంకర్‌రెడ్డి దానిమ్మ తోటకు మంటలు వ్యాపించడంతో పది దానిమ్మ చెట్లు కూడా కాలిపోయాయి. పుట్టపర్తినుంచి అగ్నిమాపక యంత్రం వచ్చేసరికి వామి కాలి బూడిదైంది. 20క్వింటాళ్ల ఉలవలు అవుతాయని, ప్రమాదంతో రూ.రెండులక్షకుపైగా నష్టం జరిగిందని, తనను ప్రభుత్వం ఆదుకోవాలని బాధితుడు కోరాడు.